ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు

మంగళవారం 25 నవంబరు 2025

అధికార్ల మాయ..!



నిబంధనల మేరకు వ్యవహరించాల్సిన అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారు. ప్రతి నెలా రూ. వేలు, లక్షల్లో జీతాలు తీసుకుంటున్న అధికారులు చిన్న చిన్న మొత్తాలకు కక్కుర్తి పడుతున్నారు. కార్యాలయంలో ధనార్జనే ధ్యేయంగా పని చేస్తున్నారు. జిల్లాలో దాదాపు 100 శాఖల్లోని ఉన్నతాధికార్ల పనుల కోసం ఎల్లో బోర్డు ఉన్న ఓనర్ కమ్ డ్రైవర్ వాహనాలున్న వారికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. అయితే ఇదంతా అధికారులు స్వప్రయోజనంతో తారుమారైపోయింది.

- సొంత వాహనాలపై ప్రభుత్వ స్టిక్కర్
- నకిలీ బిల్లులతో రూ. లక్షల్లో ప్రభుత్వ డబ్బు స్వాహా..
- సీసీలు, అటెండర్లు కార్ల డ్రైవర్లు
- లైసెన్సు లేని డ్రైవర్లతో అద్దె వాహనాలు

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే కొందరు అధికారులు సొంత కార్లను ప్రభుత్వ కార్యాలయాలకు అద్దె వాహనాలుగా ఉపయోగిస్తున్నారు.. మరికొందరు అధికారులు వాహనాలు వాడకుండానే నకిలీ బిల్లులు పెట్టి ప్రజాధనాన్ని జేబులో వేసుకుంటున్నారు. కొంత మంది అధికారులు అద్దె వాహనాలున్న వ్యక్తి నుంచి కాగితాలు తీసుకుని వివరాలను నమోదు చేసి బిల్లులు వచ్చిన వెంటనే వారి జాబితాలో డబ్బులు జమ అయ్యేలా చూసి, ఆ తర్వాత వారి నుంచి డబ్బులు తీసుకుంటున్నారు. డబ్బు కోసం చట్టవిరుద్ధంగా ప్రభుత్వాన్ని మాయ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

సొంత వాహనాలపై ప్రభుత్వ స్టిక్కర్



సొంత అవసరాల కోసం ఉపయోగించే కార్లకు తెలుపు రంగు ప్లేటు.. అద్దె కోసం నడిచే వాహనాలకు పసుపు రంగు ప్లేటు ఉండాలి. సొంత వాహనాలపై ప్రభుత్వ డ్యూటీ స్టిక్కర్ వేసి అధికారులు జిల్లా వ్యాప్తంగా తిరుగుతున్నారు. జిల్లాలో సగానికి పైగా శాఖలలో అధికారులు వైట్‌బోర్డు వాహనాలను వినియోగిస్తున్నారు. కొన్ని సంవత్సరాల నుంచి గుట్టుగా ఈ దందా కొనసాగుతోంది. సొంత వాహనాలను అద్దె వాహనాలుగా చూపి బినామీ బిల్లులు తీసుకునే అధికారుల సంఖ్య పెరిగిపోయింది. ప్రతి అధికారి ఆ శాఖ కేటాయించిన వాహనం నెలకు 2,500 కిలోమీటర్లు తిరగాల్సి ఉంటుంది. అధికారులు సంబంధిత శాఖలో పని చేసే సీసీలు, అటెండర్, క్లర్కులను డ్రైవర్లుగా వినియోగించుకుంటున్నారు.

రూ.లక్షలు స్వాహా

ప్రజా సేవ కోసం క్షేత్ర స్థాయిలో పర్యటించేందుకు అవసరమైతే వాహనాలను అద్దె తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది. రెవెన్యూ, ఎంపీడీవో, విద్యాశాఖ, ట్రెజరీ, తహసీల్దార్, పంచాయతీరాజ్ ఇంజనీర్లు, హౌసింగ్, మున్సిపల్, అంగన్‌వాడీ, మహిళా శిశు సంక్షేమం, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ తదితర విభాగాల అధికారులకు అద్దె వాహనాలను వినియోగించుకున్నందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.



- జిల్లాలోని ఉన్నతాధికారులకు నెలకు రూ.60వేలు, జిల్లా స్థాయి అధికారి వాహనానికి నెలకు రూ.45వేలు, మండల స్థాయి అధికారులు అయితే.. 35వేలు అద్దె చెల్లిస్తోంది. కానీ కొందరు అధికారులు సొంత కార్లను వినియోగిస్తూ ప్రతి నెల బిల్లు పెట్టి డబ్బులు డ్రా చేస్తున్నారు. మరికొందరు క్షేత్రస్థాయి పర్యటించకుండానే బిల్లులు స్వాహా చేస్తున్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో కొంత మంది జిల్లా అధికారులు సొంత వాహనాలను అద్దెకిచ్చి బిల్లుల స్వాహా చేస్తే.. మరో శాఖ అధికారి అద్దె వాహనాన్ని కొనుగోలు చేసి ఆ వాహనాన్ని సొంత వాహనంగా వినియోగించుకుని బిల్లులు పెట్టి సొమ్ము చేసుకుంటున్నారు. మరో అధికారి సొంత కారు వినియోగించుకుంటూ తానే డ్రైవింగ్ చేసుకుంటూ డ్రైవర్ సొమ్మును కూడా వినియోగించుకుంటున్నారు. అధికారులే అదనపు ఆదాయం కోసం ఆశపడుతున్నారు.

విచారణ చేపడతాం



ప్రతి అధికారి ప్రభుత్వ నిబంధనలను పాటించాలి. ఎవరైనా నిబంధనలను అతిక్రమిసే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటాం. ఎల్లో బోర్డు వాహనాలు మాత్రమే అద్దె వాహనాలుగా ఉండాలి. వైట్ బోర్డు వాహనాలు ఉపయోగించరాదు.

- నూరుల్ కమర్, జాయింట్ కలెక్టర్

నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించాలి



జిల్లా అధికారుల దారుల్లోనే మండల స్థాయిలో పని చేసే కొందరు తహసీల్దార్లు, ఎంపీడీవోలు అధికారులు అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అద్దె వాహనాల దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరిపి ప్రజాధనం వృథా కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ప్రజా సంఘాలు, ఓనర్ కమ్ డ్రైవర్స్ అసోసియేషన్, సేఫ్టీ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా తెలుపు రంగు వాహనాలను తొలగించి ఎల్లో బోర్డు వాహనాలున్న ఓనర్ కమ్ డ్రైవర్స్ నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ రుణాలపై కారు తీసుకున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ గిరిజన ఓనర్ కమ్ డ్రైవర్ల లబ్ధిదారులు వాహనాల రుణాలు చెల్లించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పీఎంఏవై-2 గ్రామీణ్ కింద గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగి ఇల్లు లేని వారు ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ఎ.సిరి ఓ ప్రకటనలో సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి స్థలం ఉన్న వారు సంబంధిత సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్ ద్వారా తమ పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఇల్లు మంజూరైన వారికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు.

ఫిర్యాదుల నెంబరును ప్రదర్శించాలి: కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ వైద్యసేవకు సంబంధించి అన్ని ఆసుపత్రుల్లో జిల్లాలో ఫిర్యాదులకు సంబంధించి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నెంబర్ ప్రదర్శించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. రీ ఓపెన్ అయిన కేసులకు సంబంధించి ఆయా శాఖల పరిధిలో ఉన్న కిందిస్థాయి అధికారులకు మెమోలు జారీ చేసి సంబంధిత మెమోలను వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జేసీ నూరుల్ కమర్, డీఆర్వో సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పీడీ చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనూరాధ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విచారించి న్యాయం చేస్తాం: ఎస్పీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి సమస్యలు త్వరితగతిన పరిష్కరించి బాధితులకు న్యాయం చేస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. సోమవారం స్థానిక కొత్తపేటలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఎస్పీ క్యాంపు కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహించారు. ప్రజల నుంచి 95 ఫిర్యాదులు వచ్చాయి. అడిషనల్ ఎస్పీ హుశేన్ పీరా, సీఐలు శివశంకర్, రామకృష్ణ, విజయలక్ష్మి ఉన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

- ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి ఓ వ్యక్తి మోసం చేశాడని కర్నూలు నగరంలోని శరీన్‌నగర్‌కు చెందిన పుల్లయ్య ఫిర్యాదు చేశారు. తనకు వచ్చిన ఒక ఈ-మెయిల్‌లో కర్నూలు ఓర్వకల్లు ఎయిర్‌పోర్టుకు సంబంధించి ఇండిగో ఎయిర్‌లైన్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని, ఆన్‌లైన్‌లో మునేష్ అనే వ్యక్తి పరిచయం చేసుకున్నాడని చెప్పారు. సీనియర్ ఫ్లోర్ మేనేజర్‌గా ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఫోన్ పే స్కానర్ ద్వారా రూ.23వేలు వేయించుకుని మోసం చేశాడని ఫిర్యాదు చేశారు. కోర్టు ఇంజెక్షన్ ఆర్డర్ మేరకు పొలం వేసుకున్నామని, అయితే తాము లేని సమయంలో చిన్న సుంకన్నతో పాటు 30 మంది కలిసి వరి పంటను కోసుకుని వెళ్లిపోయారని కోడుమూరు మండలం లద్దగిరి గ్రామానికి చెందిన విక్రమ్ ఫిర్యాదు చేశారు. కోడుమూరుకు చెందిన హనుమన్న టాటా ర్యాలీస్ కంపెనీ తరుపున నకిలీ మొక్కజొన్న విత్తనాలు ఇచ్చి మోసం చేశాడని, పెట్టుబడి ఖర్చులు, ఇన్సూరెన్స్ డబ్బులు అడిగితే ఇవ్వడం లేదని తుగ్గలి మండలం లంకాయపల్లె గ్రామానికి చెందిన శ్రీనివాసులు ఫిర్యాదు చేశారు. శ్రావణ్ అనే వ్యక్తి కంప్యూటర్ జాబ్ ఇప్పిస్తామని చెప్పి రూ.40 వేలు తీసుకొని మోసం చేశాడని ఎమ్మిగనూరుకు చెందిన సురేంద్రబాబు ఫిర్యాదు చేశారు. పుల్లగుమ్మికి చెందిన వడ్డె వెంకటేశులు, వడ్డె వెంకట్రాముడు తన 100 క్వింటాళ్ల (రూ.13 లక్షలు విలువ చేసే) మిరప పంటను తీసుకెళ్లి 8 నెలలు అయినా డబ్బులు ఇవ్వడం లేదని క్రిష్ణగిరి మండలం ఆగవెల్లి గ్రామానికి చెందిన వడ్డె గిడ్డయ్య ఫిర్యాదు చేశారు. కర్నూలు మున్సిపాలిటీలో స్వీపర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి కురువ భీమన్న రూ.30వేలు తీసుకుని మోసం చేశాడని కర్నూలు బండిమెట్టకు చెందిన వెంకటరమణ ఫిర్యాదు చేశారు.

రైతులపై జగన్‌ది కపట ప్రేమ

- టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి




కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతులపై మాజీ సీఎం జగన్ కపట చూపుతున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 2019 నుంచి 2024 జూన్‌వరకు సీఎం హోదాలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలోని రైతులు ఎన్ని కష్టాలు ఎదుర్కొన్నారో వారికి తెలుసన్నారు. రాష్ట్రంలో తుఫాన్లు, వరదలు వచ్చిన సమయంలో కనీసం రైతుల గురించి ఆలోచించలేదని, బయటకు వస్తే పరదాల చాటున వచ్చిన నీకు చంద్రబాబు పాలనను తప్పు పట్టే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. ఉల్లి రైతులకు రూ. 1200 క్వింటా మద్దతు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయడమేకాక హెక్టార్‌కు రూ. 50 వేలు సాయం ప్రకటించిందని గుర్తు చేశారు. పత్తి, మొక్కజొన్న, ఉద్యాన పంటలను మార్కెటింగ్ ద్వారా కొనుగోలు గురించి మాట్లాడటం, అరటిని ఇతర రాష్ట్రాలకు ఎగుమతి నిమిత్తం వారికి రవాణ సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు అధికారులను ప్రభుత్వం ఆదేశించిందని చెప్పారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలో లిక్కర్, కల్తీనెయ్యి, భూదందాలు, ఇసుక, మైనింగ్, వంటి మాఫియాల గురించి ఒక్కొక్కటి బయట పడుతుంటే దిక్కుతోచని జగన్ ప్రజల దృష్టిని మరల్చేందుకు చంద్రబాబుపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు.

హై డ్రామా..!

- ఉత్కంఠగా మాచినేనిపల్లె సహకార సంఘం ఎన్నికలు
- రెండు నామినేషన్లు దాఖలు
- ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ప్రకటించిన ఎన్నికల అధికారి
- అందుకు భిన్నంగా ఎంపీడీఓ ప్రకటన



మాచినేనిపల్లి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం భవనం



ఎంపీడీఓ నోటీసు

నంద్యాల, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విజయడెయిరీ పరిధిలో ఉన్న మాచినేనిపల్లి పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం పాలకవర్గ ఎన్నికలో హైడ్రామా నడిచింది. సోమవారం రుద్రవరం మండలం మాచినేనిపల్లి గ్రామంలో సహకార సంఘం పాలకవర్గ ఎన్నికలకు అధికారులు నోటిఫికేషన్ విడుదల చేశారు. అయితే ఉదయం నుంచి సాయంత్రం దాకా ఎన్నికలపై ఉత్కంఠ నెలకొంది. మాచినేనిపల్లె సహకార సంఘం ఎన్నికలు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ప్రతాప్‌రెడ్డి నోటీసును విడుదల చేశారు. కేవలం రెండు నామినేషన్లు మాత్రమే దాఖలు కావడంతో ఎన్నిక ఏకగ్రీవంగా ముగిసిందని ఆ నోటీలు వెల్లడించారు. ఎస్వీ జగన్‌మోహన్ రెడ్డి, ఎం.జెల్లయ్యలు మాత్రమే నామినేషన్లు వేయడంతో ఏకగ్రీవం అనివార్యమైంది. అయితే ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరగాల్సిన ఎన్నికలు వాయిదా పడినట్లు ఎంపీడీఓలు తెలిపారు. విజయ డెయిరీ పరిధిలో ఆరు విడతలుగా జరగాల్సిన ఎన్నికలు ఇప్పటి వరకు 3 విడతలు మాత్రమే జరిగాయి. విజయ టీడీపీ, వైసీపీ నాయకులు బలంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

మాచినేనిపల్లి ఎన్నికపై విభిన్న ప్రకటనలు

పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార సంఘం ఎన్నికల అధికారి మాచినేనిపల్లి పాలకవర్గ కమిటీ ఏకగ్రీవమైనట్లు సాయంత్రం ప్రకటించారు. అయితే ఎంపీడీఓ భాగ్యలక్ష్మి ప్రకటన మాత్రం మరోలా ఉంది. నామినేషన్ వేసేందుకు ఎవరూ రాకపోవడంతో ఎన్నికల ప్రక్రియ జరగలేదంటూ నోటీసును విడుదల చేశారు. దీంతో రెండు రకాలుగా వచ్చిన విభిన్న ప్రకటనతో ప్రజలు ఖంగుతిన్నారు. ఏదిఏమైనా ఎన్నికల అధికారిగా వ్యవహరించిన అధికారి ప్రకటనే ఫైనల్ అంటూ చర్చనీయాంశంగా మారింది.

మిగతా 6వ పేజీలో



ఎర్రగుడిదిన్నెలో మాజీ ఎమ్మెల్యేను గృహ నిర్బంధం చేసిన దృశ్యం

పరిశ్రమల ఏర్పాటుకు రైతులు సహకరించాలి

- జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్



రహదారిని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్

ఓర్వకల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పరిశ్రమల ఏర్పాటుకు రైతులు సహకరించాలని జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్ కోరారు. మండలంలోని పూడిచెర్ల, హుశేనాపురం గ్రామాలను సోమవారం ఆయన సందర్శించారు. మండలంలోని పూడిచెర్ల గ్రామ సమీపంలో వెళ్తున్న పైపులైన్ భూములను ఆయనతో పాటు ఆర్డీవో సందీప్ కుమార్ పరిశీలించారు. ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం నుంచి ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌కు తీసుకెళ్తున్న పైపులైన్ నిర్మాణానికి రైతులు సహకరించాలని కోరారు. ముస్లిం కాలనీ నుంచి కొండ ప్రాంతం చెరువుకట్ట వరకు పైపులైన్ ఏర్పాటు స్థలాన్ని ఆయన పరిశీలించారు. జేసీ రైతులతో మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం నుంచి గార్గేయపురం, కేతవరం, పూడిచెర్ల వరకు పైపులైన్ పూర్తయిందని, పూడిచెర్ల వద్ద సారవంతమైన భూములు రైతులు కోల్పోవాల్సి వస్తుందని, పూడిచెర్ల గ్రామ మైనార్టీ కాలనీ నుంచి కొండపై చెరువు కట్ట వరకు పైపులైన్ తీసుకెళితే ఎలాంటి ఇబ్బందులు ఉండవని రైతులు జేసీ దృష్టికి తీసుకెళ్లారు. జాయింట్ కలెక్టర్ కాంట్రాక్టరుతో చర్చలు జరిపారు. అనంతరం మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామ సమీపంలో ఏర్పాటు చేస్తున్న రిలయన్స్ ఇండస్ట్రీకి వెళ్లే రహదారిని ఆయన పరిశీలించారు. తహసీల్దార్ విద్యాసాగర్, ఎస్ఈ మనోహర్, సర్వేయర్ శంకర్ మాణిక్యం, వీఆర్వోలు, సర్వేయర్లు, పూడిచెర్ల గ్రామస్థులు లక్ష్మిరెడ్డి, ఎల్లారెడ్డి, అక్కిరెడ్డి ఉన్నారు.

పది రోజుల్లోనే..



పది రోజుల క్రితం నడి రోడ్డుపై దుకాణాలు



నాలుగు రోజుల క్రితం ధ్వంసమైన షాపులు

పది రోజుల క్రితం వరకు కర్నూలు మెడికల్ కళాశాల ఎదుట వెళ్లాలంటే నరకయాతన. కానీ ఇప్పుడంతా మారిపోయింది. పది రోజుల వ్యవధిలో ట్రాఫిక్ నియంత్రణకు శాశ్వత పరిష్కారం లభించింది. కేఎంసీ వద్ద ఓ ప్రార్థనా మందిరం ఎదుట ఏళ్లతరబడి వివాదంగా ఉన్న ఆరు దుకాణాలతో ట్రాఫిక్ ఇబ్బంది తలెత్తేది. ఇరుకుగా మారిన రోడ్డుతో నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగేవి. ఈ సమస్యను గుర్తించిన రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు. రహదారిపై అడ్డుగా ఉన్న ఆరు భవనాలను తొలగించేందుకు ముస్లిం మతపెద్దలతో చర్చించి ఒప్పించారు. అనుకున్నదే తడవుగా దుకాణాల తొలగింపు, రోడ్డు వేయడం, రహదారి వెడల్పు చకచకా జరిగిపోయాయి. ఇప్పుడు ఆ ప్రాంతంలో విశాలమైన రహదారితో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది. దశాబ్దాలుగా ఉన్న సమస్యను మంత్రి టీజీ భరత్ పరిష్కరించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

- కర్నూలు హాస్పిటల్ (ఆంధ్రజ్యోతి)

ప్రస్తుతం విశాలమైన రహదారిగా...



ఆదర్శ భోజనం..!

భారతదేశం విభిన్న సంస్కృతులు, జాతులు, ఆచారాల సమాహారం. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆచార వ్యవహారాలు సాగుతుంటాయి. అయితే అక్కడక్కడా వర్గ వైషమ్యాల, కులమతాల తారతమ్యాలు కనిపిస్తూనే ఉన్నాయి. కానీ అందుకు పూర్తి భిన్నంగా ఆదోని మండలంలోని నారాయణపురం ఆదర్శంగా నిలిచింది. కుల, మతాలను పక్కన పెట్టేసి ఊరంతా సమైక్యంగా కలసి భోజనం చేస్తూ ఆదర్శంగా నిలిచారు.



గర్జలింగేశ్వరుడు సన్నిధిలో భోజనం చేస్తున్న గ్రామస్తులు



పూజలందుకున్న గర్జలింగేశ్వర స్వామి

- గ్రామస్థులంతా ఒకేచోట సహపంక్తి భోజనం
- నారాయణపురంలో అనాదిగా వస్తున్న ఆచారం
- కుల, మతాలకు అతీతంగా ఏకమై నిర్వహణ
- కార్తీక అమావాస్య మరుసటి సోమవారం రోజు వేడుక



ఆదోని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం నారాయణపురం గ్రామంలో సోమవారం అబ్బురపరిచేలా ఇలా ఐక్య భోజనం చేశారు. ఈ గ్రామంలో తరతరాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. గ్రామంలోని గర్జలింగేశ్వరస్వామి దేవాలయంలో కార్తీకమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గ్రామస్థులు ఈ ఒక్కరోజు పనులు మానుకుని తెల్లవారుజామునే లేచి అత్యంత నియమ నిష్ఠతో ప్రతిరోజూ చేసుకునే విధంగా భోజనం వండుతారు. ఇంటిల్లిపాదికీ సరిపడా భోజనం సిద్ధమయ్యాక... అదే పాత్రను నేరుగా తీసుకెళ్లి గర్జలింగేశ్వరుడి ఆలయ సన్నిధిలో రాశిగా పోశారు. గ్రామంలో ఎన్ని కుటుంబాలు నివాసం ఉంటే అన్ని భోజనం పాత్రలు ఒక్కొక్కరుగా వచ్చి స్వామివారి ఎదుట అలా రాశిలో వేసి నిలబడ్డారు. అన్ని ఇళ్ల నుంచి అన్నం రావడం పూర్తి అవ్వగానే గ్రామపెద్దలు, పూజారులు ఆ భోజనం రాశికి ప్రత్యేక పూజలు నిర్వహించి పసుపు, బండారు జల్లారు. పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం ఆవరణలో కలిసి కూర్చున్నారు. రాశిగా పోసిన భోజనాన్ని విస్తరాకుల్లోకి వడ్డించుకుని అందరూ కలిసి ఆరగించారు. ఈ సంప్రదాయం తమ గ్రామాన్ని ఐక్యంగా ఉంచుతోందని ఊరి పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. స్వామివారికి భోజనం నివేదించి, అన్న ప్రసాదాన్ని కలిసి తింటే మేలు జరుగుతుందని ఆ ఊరి జనం విశ్వసిస్తారు.





రాశిగా పోసిన భోజనానికి పూజలు చేస్తున్న అర్చకులు

కుల, మతాలకు అతీతంగా...



కుల మతాలకు అతీతంగా గ్రామంలో ఎన్ని కుటుంబాలు ఉంటే అన్ని కుటుంబాలకు చెందిన వారు ఒకరోజు వారి ఇంట్లో ఏమి తింటారో అదే దాన్ని ఒకరోజుకు సరిపడా వంటను వండి గుడిలో రాశిగా వేస్తారు. అలా వేసిన భోజనాన్ని గ్రామంలో ఉన్న అన్ని కుటుంబాల వారు అందరూ ఒకోచోట చేరి సహపంక్తి భోజనం చేస్తాం. అలా చేస్తే మంచి వర్షాలు కురిసి పంటలు బాగా పండుతాయని నమ్మకం. ఈ ఆచారం పెద్దల కాలం నాటి నుంచి వస్తుంది. మేము కూడా అలానే పాటిస్తున్నాం.

- శేఖర్, మాజీ ఎంపీటీసీ

తరతరాలుగా ఇదే ఆచారం



తరతరలాలుగా ఈ సంప్రదాయం కొనసాగుతోంది. కుల, మతాలకు అతీతంగా, గ్రామస్థులంతా ఒకేచోట చేరి దైవ సన్నిధిలో కలిసిమెలిసి భోజనం చేస్తాం. ఇలా చేస్తే ఊరికి మంచి జరుగుతుందని మా పెద్దలు చెప్పారు. ఒకరోజు ఏ ఇంట్లో ఏ భోజనం వండుకుని తింటారో, దాన్నే తయారు చేసి తీసుకొచ్చి రాశిలో కలుపుతాం. ఆ రాశికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అందరం కలిసి భోజనం చేస్తాం.

- లింగారెడ్డి, గ్రామపెద్ద

మంచి జరుగుతుందని



గ్రామంలోని ప్రతి ఇంట్లో ఒకరోజు తినే భోజనాన్ని తయారు చేసి గర్జలింగేశ్వరస్వామి సన్నిధిలో ఉంచుతాం. స్వామి సన్నిధిలోనే భోజనం చేస్తే మంచి జరుగుతుందని మా నమ్మకం. తాత ముత్తాల నుంచి వచ్చిన ఆచారాన్ని మేము కూడా పాటిస్తున్నాం.

- అయ్యప్పరెడ్డి, గ్రామపెద్ద

కరువు దరిచేరదు



నాకు ఊహ తెలిసినప్పటి నుంచి వస్తున్న ఆచారం.. కార్తీక పూజల అనంతరం పెద్ద పండగలా ఈ వేడుకను చేసుకుంటాం. కుల, మతాలకు అతీతంగా ఒకచోటుకు చేరి అన్నం తినడం సంప్రదాయంగా వస్తోంది. ఇలా చేస్తే కరువు దరిచేరదని మా నమ్మకం.

- రామచంద్రారెడ్డి, గ్రామపెద్ద

నగర పాలక మేనేజర్ చిన్నరాముడుకు అరుదైన గౌరవం

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం



కర్నూలు న్యూసిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ మేనేజర్ ఎన్.చిన్నరాముడుకు అరుదైన గౌరవం లభించింది. వచ్చే ఏడాది జనవరి 3,4,5, తేదీల్లో గుంటూరులో ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్వర్యంలో జరగనున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభలకు అతిథిగా ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్, మహాసభల ప్రధాన సమన్వయకర్త పి.రామచంద్ర అధికారికంగా వెల్లడించారు. చిన్నరాముడు నగర పాలకలో తెలుగు భాషా ప్రచారం, వికాసానిక అంకితభావంతో అందిస్తున్న విశిష్ఠ సేవలు, రాష్ట్ర వ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నాయని, తెలుగు భాషాభిమానానికి ఆయన చూపుతున్న నిబద్ధత అనేక మందికి స్ఫూర్తిదాయకమని నిర్వాహకులు పంపిన లేఖలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా గుంటూరులో జరిగే మహాసభల కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు ఆంధ్ర సారస్వత సేవా పురస్కారాన్ని అందుకోనున్నారు.

నేటి నుంచి బీఈడీ పరీక్షలు

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): బీఈడీ 3వ సెమిస్టర్ రెగ్యులర్/ సప్లమెంటరీ పరీక్షలు మంగళవారం నుంచి 29 వరకు నిర్వహిస్తున్నట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 19 పరీక్ష కేంద్రాల్లో బీపీఈడీ, ఎంపీఈడీ, బీఈడీ పరీక్షలకు సంబంధించిన విద్యార్థులు హాల్ టికెట్లతో పరీక్ష కేంద్రాలకు హాజరు కావాలన్నారు. బీఈడీలో రెగ్యులర్ 3,474 మంది, సప్లమెంటరీ 471, బీపీఈడీలో రెగ్యులర్ 145, సప్లమెంటరీలో 21, ఎంపీఈడీలో రెగ్యులర్ 86, సప్లమెంటరీలో 27 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు.

మల్లన్న సేవలో సినీ దర్శకుడు సుకుమార్

శ్రీశైలం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ప్రముఖ సినీ దర్శకుడు సుకుమార్ దర్శించుకున్నారు. సోమవారం ఉదయం స్వామివారి గర్భాలయ అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులచే వేదాశీర్వచనం చేయించి తీర్థప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు.



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో దర్శకుడు సుకుమార్

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి: డీఈవో

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని జిల్లా విద్యాశాఖ అధికారి శామ్యూల్ పాల్ ఆకాంక్షించారు. డివిజన్ స్థాయిలో టెన్త్ క్లాస్ సబ్జెక్టులు బోధిస్తున్న సబ్జెక్టు నిపుణులతో సోమ వారం నగరంలోని వర్చువల్ స్టూడియోలో సమన్వయ సమావేశం నిర్వహించారు. డీఈవో మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టుకు 12 మంది చొప్పున మొత్తం 84 మంది సబ్జెక్టు నిపుణులకు వర్క్‌షాపు నిర్వహించినట్లు తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణతలో జిల్లా వెనుకబడడానికి ఉపాధ్యాయుల కొరత చాలా ఉండేదని, ఈ విద్యా సంవత్సరంలో మెగా డీఎస్సీ, పదోన్నతుల ద్వారా దాదాపు ఉపాధ్యాయుల కొరత తీరిందని చెప్పారు. పశ్చిమ ప్రాంత మండలాల్లోని విద్యార్థులు వలసలు వెళ్లే పరిస్థితులు ఉన్నాయని, వీటిని అధిగమించడానికి వందరోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసి విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులను సంసిద్ధులు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ గోవింద్ నాయక్, డీసీఈబీ సెక్రటరీ నాగరాజు, పాఠశాల హెచ్‌ఎంలు మధుసూదన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

హుటాహుటిన తొలగింపు..!



ఆదివారం దాకా ఇలా ఫ్లెక్సీలతో డీఈఓ కార్యాలయం

కర్నూలు కలెక్టరేట్ ప్రాంగణంలోన్ని డీఈఓ కార్యాలయానికి ఉన్న రెండు ఫ్లెక్సీలను అధికారులు హుటాహుటిన తొలగించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన యూనిఫాంతో ఇద్దరు చిన్నారుల ఫొటోలు, అప్పటి సమాచారంతో ఉన్న ఆ ప్రచార ఫ్లెక్సీలను రెండేళ్లయినా అధికారులు మార్చలేదు. అయితే ఆదివారం దాకా ఉన్న ఆ ఫ్లెక్సీలను సోమవారం మధ్యాహ్నం కార్యాలయ సిబ్బంది హుటాహుటిన తొలగించారు. - కర్నూలు (ఆంధ్రజ్యోతి)



సోమవారం ఉదయం తొలగింపు తర్వాత...

మాక్ అసెంబ్లీ రేపే

- జిల్లా నుంచి ఏడుగురు ఎంపిక
- సమస్యలపై ప్రస్తావించనున్న విద్యార్థులు



మాక్ అసెంబ్లీకి ఎంపికైన విద్యార్థులతో డీఈవో శామ్యూల్‌పాల్

ఆలూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బుధవారం అసెంబ్లీ ఆవరణలో పాఠశాల విద్యా శాఖ నిర్వహించే మాక్ అసెంబ్లీకి జిల్లా నుంచి ఏడుగురు విద్యార్థులను ఎంపిక చేశారు. స్టూడెంట్ అసెంబ్లీలో పాల్గొనేందుకు నియోజకవర్గానికి ఒక విద్యార్థి చొప్పున ఒకరిని ఎంపిక చేశారు. మొత్తంగా జిల్లా నుంచి ఏడుగురు మంది విద్యార్థులు మాక్ అసెంబ్లీలో 'అధ్యక్షా' అనేందుకు సిద్ధమయ్యారు. వీరిలో నలుగురు అబ్బాయిలు, ముగ్గురు అమ్మాయిలు ఉన్నారు. స్టూడెంట్ అసెంబ్లీని ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు ఎమ్మెల్యేలు వీక్షించనున్నారు. అనంతరం విద్యార్థులు అసెంబ్లీ హాలును సందర్శించి సీఎంతో గ్రూపు ఫొటో దిగనున్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పించిన ఉపాధ్యాయులు

అసెంబ్లీలో జిల్లా విద్యార్థులు వారి నియోజకవర్గంలోని సమస్యలు ప్రస్తావించేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ప్రొటెం స్పీకర్, ఆపై స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఎలా జరుగుతుంది?, ముఖ్య మంత్రిగా, ప్రతిపక్ష నేతగా జిల్లా విద్యార్థులు ఎంపికైతే ఎలా వ్యవహరిం చాలి?, జీరో అవర్, ప్రశ్నోత్తరాల సమయం, బిల్లులపై చర్చ, వాటి ఆమోదం వంటి అంశాలపై శిక్షణ ఇచ్చారు. అంతేగాకుండా అసెంబ్లీ నిర్వహణ సమయంలో మాక్ ఎమ్మెల్యేలు సభను ఎలా నిర్వహించాలి? అన్న విషయాలపై శిక్షణ ఇచ్చారు.

ఎంపికైన విద్యార్థులు వీరే..

ఆలూరు నియోజకవర్గం నుంచి హాలహర్వి జడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి పంచగుండెల్ ప్రవీణ్‌కుమార్, ఆదోని నుంచి మున్సిపల్ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థి గౌతమి, మంత్రాలయం నుంచి జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి సాలె వీరేంద్ర, ఎమ్మిగనూరు నుంచి దైవందిన్నె జడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థి నవీత్‌కుమార్, పత్తికొండ నుంచి వెల్దుర్తి డా. బీఆర్ అంబేడ్కర్ గురుకులం 10వ తరగతి విద్యార్థిని చింతమాను గాయత్రి, కోడుమూరు నుంచి సి.బెళగల్ జడ్పీ హైస్కూల్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి లోకేశ్వర్‌రెడ్డి, కర్నూలు నుంచి కర్నూలులోని బి.క్యాంపు గర్ల్స్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని సాపోగుల దయానా ఎంపికయ్యారు. అలాగే గోరంట్ల మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ స్కూల్ తొమ్మిదో తరగతి విద్యార్థి పీజీ సాయి మహీధర్‌ను అదనంగా ఎంపిక చేసినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు.

కిలో రూ.60 పైనే..

- పెరిగిన కూరగాయల ధరలు
- కొనడానికి వెనుకాడుతున్న సామాన్యులు..

డోన్ రూరల్, నవంబరు 24 (ఆంధ్రజోతి): డోన్ మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. మార్కెట్ వెళ్లిన సామాన్యులు కూరగాయల రేట్లు విని బెంబేలెత్తిపోతున్నారు. ధరలు ఇలాగే కొనసాగితే.. కొనలేము.. తినలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డోన్ కూరగాయల మార్కెట్‌లో టమోటా కిలో రూ.60, పచ్చిమిర్చి కేజీ రూ.60, బీన్స్ కేజీ రూ.100, క్యారెట్ రూ.100, బీట్‌రూట్ రూ.80, బెండకాయ రూ.60, బీరకాయ రూ.60, చిక్కుడు రూ.80, సొరకాయ రూ.60, కాకరకాయ రూ.60, క్యాప్సికం రూ.100, దోసకాయ రూ.60, దొండ రూ.60 ప్రకారం ధరలు పలుకుతున్నాయి.

సామాన్యులకు ధరలు అందుబాటులో లేవు



సామాన్యులకు కూరగాయల ధరలు అందుబాటులో లేవు. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు కొనుగోలు చేయాలన్నా భయపడాల్సిన పరిస్థితి వచ్చింది. ధరలు ఇలాగే కొనసాగితే.. సామాన్యులు, పేదలు ఇబ్బంది పడాల్సి వస్తుంది.

- షమీమ్ బేగం, మహిళా సంఘం నాయకురాలు, డోన్

సాగు తగ్గడమే కారణం

డోన్ మండలంలోని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ సీజన్‌లో కూరగాయల సాగు కొంత తగ్గడం.. ఇటీవల మొంథా తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు కూరగాయల ధరల పెరుగుదలకు కారణమవుతుంది. నెల రోజుల్లో కూరగాయల సాగు పరిస్థితి చక్కబడే అవకాశం ఉంది.

- జి.కళ్యాణి, ఉద్యాన శాఖ అధికారి, డోన్



రుద్రవరం మార్కెట్‌లో..

రుద్రవరం: రుద్రవరం మార్కెట్లో సోమవారం కూరగాయలు కిలో ధర రూ.80 పైగానే పలికాయి. ఇక్కడ కూరగాయలు కొనుగోలు చేయడానికి సుమారు 15 గ్రామాల ప్రజలు తరలివచ్చారు. కాకరకాయ, బెండకాయ, మట్టిక్కాయ, చిక్కుడు, వంకాయ కిలో రూ.80 పలికింది. టమోటా రూ.60 పలికింది. కూరగాయల ధరలు పెరగడానికి మొంథా తుఫానే కారణమని వ్యాపారులు చెబుతున్నారు.



హైడ్రామా..!

(5వ పేజీ తరువాయి)

నంద్యాల విజయ డెయిరీ పరిధిలోని మాచినేనిపల్లిలో నామినేషన్ ప్రక్రియ నేపథ్యంలో జిల్లా ఎస్పీ సునీల్ షెరాన్ ఆదేశాల మేరకు పోలీసులు గట్టి చర్యలు తీసుకున్నారు. మాజీ ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రరెడ్డిని, టీడీపీ యువనేత భూమా విఖ్యాత్ రెడ్డిని గృహనిర్బంధం చేశారు. కోవెలకుంట్ల సీఐ హనుమంతనాయక్ రుద్రవరం మండలం ఎర్రగుడిదిన్నెలోని మాజీ ఎమ్మెల్యే గృహానికి తెల్లవారుజామునే చేరుకుని హౌస్ అరెస్టు చేశారు. ఆయా గ్రామాల్లో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ ప్రమోద్ తెలిపారు.

అక్రమ ఎన్నిక చెల్లదు : విఖ్యాత్

ఈ ఎన్నికల తంతు పాల ఉత్పత్తిదారుల కార్యాలయంలో జరగాల్సి ఉండగా కార్యాలయ తలుపులు తెరవకుండానే మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి స్వగ్రామం ఎర్రగుడిదిన్నెలో అక్రమంగా నిర్వహించారు. ఇలాంటి ఎన్నిక చెల్లదు.

ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి సహకారం

● రూ. కోటి విరాళం అందజేసిన మంత్రి టీజీ భరత్

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ వర్సిటీ అభివృద్ధికి సహకరిస్తానని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. మంత్రి తన చాంబర్‌లో ఉర్దూ వర్సిటీ ఉపకులపతి డా. ప్రొఫెసర్ షావలిఖాన్, రిజిస్ట్రార్ లోక్‌నాథ్‌కు రూ.కోటి చెక్కును విరాళంగా అందజేశారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ సొంత భవనంలో వర్సిటీలో కొనసాగేలా సహకరిస్తామని, భవనం పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. వర్సిటీ అభివృద్ధికి తన వంతు సహకరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం వీసీ మాట్లాడుతూ ఈనెల 11 ప్రకటించిన విధంగా బిల్డింగ్ నిర్మాణానికి విరాళం అందించడం అభినందనీయమని అన్నారు. అనంతరం రిజిస్ట్రార్ లోక్‌నాథ్‌తో కలిసి మంత్రికి పూలబొకే అందించి శాలువాతో సన్మానం చేశారు. బోధన, బోధనేతర సిబ్బంది మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.



ఉర్దూ వర్సిటీ వీసీకి చెక్కును అందజేసిన మంత్రి టీజీ భరత్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

● బైకు, ఆటో ర్యాలీలను ప్రారంభించిన ఎస్పీ



కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. రోడ్డు భద్రత నియమాలపై అవగాహన కల్పించడం కోసం సోమవారం బైకు, ఆటో ర్యాలీలను కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీని ఎస్పీ ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్‌విహార్, కలెక్టరేట్ మీదుగా సి.క్యాంపు సెంటర్ వరకు కొనసాగింది. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ మార్కు ఉన్న హెల్మెట్లను ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలని సూచించారు. ఆటో డ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవద్దని సూచించారు. రద్దీ ప్రాంతాలు, కూడళ్లు, జంక్షన్‌లలో రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్‌పై తనిఖీలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, డీఎస్పీ బాబు ప్రసాద్, సీఐలు మన్సూరుద్దీన్, విక్రమసింహ, తేజామూర్తి, చంద్రబాబు నాయుడు, మధుసూదన్‌రావు, పార్థసారథి, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ట్రాఫిక్ పోలీసులు, సివిల్, ఏఆర్, ఆయా షోరూంల సిబ్బంది, యువకులు, ఆటోల డ్రైవర్లు పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో పది మంది డీబార్

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో నిర్వహించిన డిగ్రీ 3వ సెమిస్టర్ పరీక్షల్లో 10 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు పరీక్షల విభాగం కంట్రోలర్ డా వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 27 పరీక్ష కేంద్రాల్లో 8,958 మంది దరఖాస్తు చేసుకోగా 8,190 మంది పరీక్ష రాశారని పేర్కొన్నారు.

29న జడ్పీ స్థాయి సంఘాల సమావేశాలు

కర్నూలు, న్యూసిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు ఈ నెల 29న నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో జి.నాసరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్‌లోని మినీ సమావేశ భవనంలో ఏడు స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసారని ఆయన తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు 2వ స్థాయి సంఘం, 11.00 నుంచి 12.00 గంటల వరకు 3వ స్థాయి సంఘం, 12.00 గంటల నుంచి 1.00 గంటల వరకు 6వ స్థాయి సంఘం సమావేశాలు నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో తెలిపారు. అలాగే మధ్యాహ్నం 1.00 నుంచి 2.00 గంటల వరకు 4వ స్థాయి సంఘం, 2.30 గంటల నుంచి 3.30 వరకు 5వ స్థాయి సంఘం, 3.30 నుంచి 5.30 వరకు 1, 7వ స్థాయి సంఘాల సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

జనసేన కార్యకర్త కుటుంబానికి బీమా పరిహారం


చెక్కును అందిస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

కర్నూలు రూరల్ నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన జనసేన కార్యకర్త బండ శ్రీనివాసులు కుటుంబ సభ్యులకు జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు రూ.5లక్షల బీమా చెక్కును అందజేశారు. మంగళగిరి తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం జనసేన పార్టీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకెపోగు రాంబాబు ఆధ్వర్యంలో చెక్కును శ్రీనివాసులు భార్య లలితమ్మకు అందజేశారు. రాంబాబు మాట్లాడుతూ కార్యకర్త బండ శ్రీనివాసులు ప్యాలకుర్తి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారని, దీంతో ఆయన కుటుంబ సభ్యులకు బీమా చెక్కును అందించినట్లు ఆయన తెలిపారు.

పత్తి వ్యాపారిపై కేసు.. రూ.30 వేల జరిమానా

కోడుమూరు రూరల్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వర్కూరులో లీగల్ మెట్రాలజీ అధికారులు సోమవారం పత్తి కొనుగోలుపై ఆకస్మికంగా తనిఖీ చేసి వ్యాపారిపై కేసు నమోదు చేసి రూ.30 వేలు జరిమానా విధించారు. ఇన్‌స్పెక్టర్ ఎస్ఎండీ గౌస్ మాట్లాడుతూ వ్యాపారి హెచ్.హనుమంతు వినియోగించే కాటా పది కిలోలకు 1200 గ్రాములు తక్కువగా నమోదైనట్లు గుర్తించామని తెలిపారు. తూకపు కాటాలపై రైతులకు అవగాహన కల్పించారు. తూకపు యంత్రాలకు లీగల్ మెట్రాలజీ ముద్ర తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు.


కాటాను పరిశీలిస్తున్న ఇన్‌స్పెక్టర్

కాల్వలో పడి బాలుడి మృతి

నంద్యాల టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని పొన్నాపురం వద్ద ఉన్న కేసీ కాల్వలో పడి బాలుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ ఈశ్వరయ్య సోమవారం తెలిపారు. పొన్నాపురానికి చెందిన హరున్‌బాషా, నూరి దంపతుల కుమారుడు ఖాజావలి(18) సోమారం తన స్నేహితులతోపాటు ఈతకు వెళ్లాడు. బాలుడికి ఈత రాకపోవడంతో గట్టున కూర్చుకున్నాడు. ప్రమాదవశాత్తు కాలి జారి కేసీ కాల్వలో పడిపోయి గల్లంతయ్యాడు. పోలీసులు గాలించి మృతదేహాన్ని సాంబవరం వద్ద బయటకు తీశారు. పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లిదండ్రులు కూలీ పనులు చేసుకొని జీవిస్తున్నారు. మృతుడు కూడా వారితో పాటే కూలీ పనులకు వెళ్లేవాడు. తల్లిదండ్రులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు..

కర్నూలు క్రైం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉలిందకొండ పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నటేకూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హర్షా (18) అనే యువకుడు దుర్మరణం చెందాడు. దిన్నెదేవరపాడు చెందిన బోయ నాయుడు, హర్ష అనే ఇద్దరు స్నేహితులు కలిసి పల్సర్ బైక్‌పై చెట్లమల్లాపురం వెళుతున్నారు. చిన్నటేకూరు ఫ్లైఓవర్ పైన వీరి బైక్ అదుపు తప్పి డీవైడర్‌ను డీ కొట్టింది. బైక్ నడుపుతున్న నాయుడు హెల్మెట్ ధరించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. వెనుకాల కూర్చున్న హర్ష వేగంతో కిందపడటంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉలిందకొండ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం మార్చురికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయ తెలిపారు.


ప్రమాద స్థలంలో బైక్

చికిత్స పొందుతూ యువకుడు..

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఇందిరానగర్ చెందిన రఘు (25) అనే యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఈ నెల 14వ తేదీన రఘు పని ముగించుకొని ఇంటికి తన బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి ప్రమాదవశాత్తు కిందపడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కర్నూలులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆదివారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మీ ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు.

‘డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్’కు 65 వినతులు

- కర్నూలు నుంచి అత్యధికంగా 17 అర్జీలు

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహించిన డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్‌కు 65 మంది సమస్యలు తెలిపారని సీఎండీ లోతేటి శివశంకర్ తెలిపారు. సోమవారం తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కర్నూలు నుంచి అత్యధికంగా 17 మంది సమస్యలను సీఎండీ దృష్టికి తీసుకువచ్చారు. వినియోగాదారుల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలని అయి జిల్లాల ఎస్‌ఈలను సీఎండీ ఆదేశించారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు, లైన్లుమార్పు, ఫెయిల్ అయిన ట్రాన్స్‌ఫార్మర్ల మార్పు, లో-ఓల్టేజీ సమస్య, ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యం పెంపు, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తిరుపతి కార్పొరేట్ కార్యాలయ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

అధికారుల ఇష్టారాజ్యం

- మోదీ సభ పేరుతో వెంచర్‌లో విద్యుత్ లైన్
- ఎస్ఈ దృష్టికి రావడంతో పరిశీలన
- ఏడీఈ, ఏఈల నిర్లక్ష్యంపై మండిపడ్డ కర్నూలు ఎస్ఈ


మోదీసభ ప్రాంతంలోని వెంచర్‌లో విద్యుత్ లైన్


ఎస్ఈ ఆదేశాలతో ఇలా తొలగించారు

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల నగరంలో జరిగిన ప్రధాని మోదీ బహిరంగ సభను సాకుగా చేసుకుని విద్యుత్ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సభకు వచ్చే వాహనాల పార్కింగ్ ప్రదేశాల్లో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో భారీగా విద్యుదీకరణ పనులు చేపట్టారు. అందుకోసం వెయ్యికి పైగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు అంటున్నారు. ఈ సందర్భంగా కర్నూలు డివిజన్ పరిధిలోని ఏడీఈ, ఏఈ అధికార దుర్వినియోగానికి పాల్పడినట్లు విమర్శలు వచ్చాయి. అక్టోబరు 16న మీటింగ్ జరిగితే నవంబరు 23 వరకు వెంచర్‌లో విద్యుదీకరణ లైన్లు ఆలాగే కొనసాగించడం వెనుక అధికారుల లోపాయికారి ఒప్పందం ఉండనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వెంచర్‌లో విద్యుత్ లైన్‌ను పరిశీలించిన ఎస్ఈ

అక్టోబరు 16న కర్నూలు జిల్లా నన్నూరు టోల్‌ప్లాజా సమీపంలోని రాగమయూరి వెంచర్‌లో భారీ బహిరంగసభ నిర్వహించారు. ప్రధాని సభను సాకుగా చూపి ఏకంగా ఓ వెంచర్ యాజమాన్యంతో అధికారులు కుమ్మక్కై దాదాపు 20 స్తంభాలతో లైన్ ఏర్పాటు చేసినట్లు ఆరోపణలు గుప్పుమన్నాయి. కర్నూలు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈకి ఫిర్యాదు అందడంతో ఆదివారం ఆ వెంచర్‌ను ఎస్ఈ ఆర్. ప్రదీప్ కుమార్, ఎస్ఏఓ చిన్నరామువులు, సివిల్ ఏడీఈతో కలిసి పరిశీలించారు. వెంచర్‌లో విద్యుదీకరణ పనులు చేసినట్లు స్పష్టంగా కనిపిస్తుండటంతో కర్నూలు డివిజన్ అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కర్నూలు రూరల్స్ ఏడీఈ, ఓర్వకల్లు ఏఈలకు మెమో జారీ చేస్తానని ఆగ్రహం వ్యక్తం చేసి తక్షణమే విద్యుత్ లైన్లు తొలగించాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం పనికి రాదని అధికారులపై మండిపడ్డారు.

క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యాన్ని ఉపేక్షించం



మోదీ సభ ప్రాంగణానికి సమీపంలోని ఓ వెంచర్‌లో ఎస్టిమేషన్ లేకుండా విద్యుదీకరణ పనులు చేశారని ఫిర్యాదుతో ఆదివారం ఆ ప్రదేశాన్ని పరిశీలించాను. దాదాపు 40 రోజులు లైన్లు అక్కడే ఉన్నాయి. తక్షణమే విద్యుత్ స్తంభాలను తొలగించాలని ఏడీఈ, ఓర్వకల్లు ఏఈలను ఆదేశించాం. ఆ ప్రాంగణంలో ఎక్కడ పడితే అక్కడ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటిని సురక్షిత ప్రాంతానికి తరలించాలని ఆదేశించాం. **- ప్రదీప్‌కుమార్, ఎస్ఈ**

ఎట్టకేలకు వెంచర్‌లో విద్యుత్ లైన్లు తొలగింపు

కర్నూలు ఆపరేషన్ ఎస్ఈ ఆర్. ప్రదీప్‌కుమార్ ఆదేశాల మేరకు ఎట్టకేలకు సోమవారం ఆ వెంచర్లో విద్యుత్ లైన్లను అధికారులు తొలగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏడీఈ, ఏఈ సిబ్బందితో కలిసి మోదీ సభ ప్రాంతంలో ఉన్న స్తంభాలను తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ అంశంపై స్థానిక అధికారును సంప్రదించగా స్తంభాలు చోరీకి గురవుతాయని వెంచర్లో లైన్ తొలగించలేదని సూచించడం గమనార్హం.

మారిన ఆహారపు అలవాట్లతో అనారోగ్యం

- సిరి ధాన్యాలతో బీపీ, షుగర్‌ని నియంత్రించవచ్చు
- ఆహార, ఆరోగ్య నిపుణుడు ఖాదర్ వలి


మాట్లాడుతున్న డా. ఖాదర్ వలి

కర్నూలు కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మారిన ఆహారపు అలవాట్లు నేడు అనేక అనారోగ్యాలకు కారకాలుగా నిలుస్తున్నాయని ప్రముఖ ఆహార ఆరోగ్య నిపుణుడు, పద్మశ్రీ డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. అదితి చిరుధాన్యాలు సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని టీజీవీ కళాక్షేత్రంలో ఏర్పాటు చేసిన ‘చిరుధాన్యాల అవగాహన సదస్సు’కు డాక్టర్ ఖాదర్ వలి ముఖ్యవక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ గత ఐదు దశాబ్దాలుగా భారతీయ ఆహార పంటలు పండించే విధానంలో అనేక మార్పులు చోటు చేసుకున్నాయని చెప్పారు. అయితే ఇవన్నీ ప్రకృతి సహజంగా వస్తున్న మార్పులు కాదని, కృత్రిమంగా కార్పొరేట్ సంస్థల ఒత్తిడుల వల్ల వచ్చినవే అని ఆరోపించారు. పంటల ఉత్పత్తులు పెరిగేందుకు ఎరువులను వాడకం మొదలైందని, ప్రతిఫలంగా వాటి ప్రభావం ఆహార ధాన్యాలపై దుష్పరిణామాలు కలిగిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మందులు చల్లిన వరి, గోధుమ వంటి పంటల్ని 16వందల మిలియన్ టన్నుల పండిస్తూ ప్రజలకు అనారోగ్యాన్ని కలిగించేలా చర్యలు జరిగిపోతున్నాయని అన్నారు. వర్షం పడితే పండే పంటలు చిరుధాన్యాలని, నీళ్ల కట్టి పండించే పంటలు వరి, గోధుమలు అని చెప్పారు. ప్రకృతి సహజంగా వర్షాధారంతో పండే పంటలకు, నీటినిలువతో పండించే పంటలకు ఎంతో తేడా ఉంటుందని అన్నారు. ఒకనాడు దేశంలో 240 రకాల చిరుధాన్యాలు పండేవని, నేడు పదికి మించి సిరిధాన్యాలు లభించడం లేదని చెప్పారు. సీ4 గ్రాసెస్ సీడ్‌గా చెప్పుకునే చిరుధాన్యాల్లో ఫైబర్ శాతం ఎక్కువ ఉండి, ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవి తోడ్పడుతాయని అన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యమని, ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్‌లకు దూరంగా ఉంటూ చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా మార్చుకోవాలని సూచించారు. మరో అతిథి పారిశ్రామికవేత్త టీజీ శివరాజప్ప మాట్లాడుతూ ఒకప్పుడు చిరుధాన్యాల పంటలకు నిలయంగా జిల్లా ఉండేదని, ఆ పరిస్థితులు తిరిగి రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ జిల్లా అధ్యక్షుడు ఐ. విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు చిరుధాన్యాలు పండించేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో అదితి చిరుధాన్యాల సంస్థ అధినేతలు సోమశేఖర్ పోగుల, మోహన్‌కుమార్ కడింపల్లి తదితరులు ప్రసంగించారు.

మండలి, గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలి

- రాయలసీమ రాష్ట్ర సమితి జాతీయ అధ్యక్షుడు కుంచం వెంకటసుబ్బారెడ్డి


మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

చాగలమర్రి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి, గవర్నర్ల వ్యవస్థను రద్దు చేయాలని రాయలసీమ రాష్ట్రసమితి జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కుంచం వెంకటసుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్రపతికి తన పార్టీ తరపున లేఖ రాశారు. ఇందుకు సంబంధించిన వివరాలను సోమవారం చాగలమర్రిలో ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 53 ఆధారంగా ప్రధానమంత్రి సలహా మేరకు రాష్ట్రపతి గవర్నర్లను నియమిస్తున్నారని అన్నారు. గవర్నర్ రాష్ట్రానికి అధిపతి మాత్రమే కానీ ఎటువంటి చట్టబద్ధమైన శాసనసభ విధులను నిర్వర్తించలేరన్నారు. రాజ్యాంగం ప్రకారం గవర్నర్, మంత్రిమండలికి విధుల నిర్వహణలో సలహాలు ఇస్తుంది కానీ ఎటువంటి నిర్ణయం తీసుకునే అధికారం లేదని అన్నారు. గవర్నర్ లేకున్నా రాష్ట్రపరిపాలన సాగుతుందన్నారు. గవర్నర్ అధికారంలో ఉన్నా రాజకీయ పార్టీకి ప్రతినిధిగా వ్యవహరిస్తారని, పక్షపాతంగా ఉంటూ కేంద్రంలోని పాలక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో 1982లో ఎన్టీరామారావు శాసనమండలిని పూర్తిగా రద్దు చేశారన్నారు. 2020లో వైఎస్ జగన్ కూడా శాసనమండలి వ్యవస్థ అనవసరమని భావించి శాసనసభలో 1/3 మెజార్టీతో తీర్మానం చేసి పార్లమెంట్‌కు సమర్పించారన్నారు. అయితే ఇంతవరకు ఆ తీర్మానాన్ని పార్లమెంట్ ఆమోదించలేదన్నారు. శాసనమండలి వ్యవస్థ వల్ల ప్రయోజనం లేదని అన్నారు. రాష్ట్రపతికి, పార్లమెంట్ స్పీకర్‌కు వినతి పత్రం అందజేస్తామన్నారు. ఆర్యవైశ్య నాయకులు రామసుబ్బారావు, రాష్ట్రమైనార్టీ నాయకులు సాదర్‌వలి, జిల్లా మైనార్టీ నాయకుడు ముష్కిన్, యూత్ లీడర్ సుబహాన్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్రేవుల జలాశయం కోసం ఐక్య పోరాటం

- కేపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష


మాట్లాడుతున్న కేపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు శ్రీహర్ష

కర్నూలు న్యూసిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రాయలసీమకు జీవనాడి గుండ్రేవుల ప్రాజెక్టు సాధనంలో అన్ని పార్టీలు, ప్రజా సంఘాలతో కలిసి ఐక్య పోరాటం చేస్తామని కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష అన్నారు. సోమవారం రాజ్‌విహార్ నుంచి ధర్నా చౌక్ వరకు రైతులు, యువత, విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చౌక్ వద్ద 48 గంటల జల సమర దీక్ష చేపట్టారు. నగరానికి తాగునీరు, పశ్చిమ ప్రాంతంలో రైతులకు సాగునీరు అందించగల శాశ్వత పరిష్కారంగా భావిస్తున్న గుండ్రేవుల ప్రాజెక్టు అత్యవసరతను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు సమితి ఈ దీక్షను నిర్వహిస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే రాయలసీమ నీటి భద్రత, సాగునీటి స్థిరీకరణ, పరిశ్రమలకు నీటి లభ్యత, వర్షప్రమాద నియంత్రణ అంశాల్లో శాశ్వత మార్పులు, సంభవిస్తాయని, ప్రజలు, యువత, విద్యార్థులు, రైతు సంఘాలు కలిసి చేస్తున్న ఈ ఉద్యమం ప్రాంత భవిష్యత్తు కోసం ప్రజా ఐక్యతకు పెద్ద నిదర్శమన్నారు. సీఎంఎల్పీఎం సెంట్రల్ జనరల్ సెక్రటరీ గఫూర్, జి.పుల్లయ్య ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ జి.పుల్లయ్య, ఇంజనీరింగ్ కాలేజీ చైర్మన్ కేవీ సుబ్బారెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం కన్వీనర్ మన్సూర్, మాజీ కార్పొరేటర్ పుల్లారెడ్డి, అడ్వకేట్ హేమలత, ఆర్‌వీపీఎస్ నాయకుడు రవి, సంఘీభావం ప్రకటించారు. సీహెచ్ శ్రీనివాసులు, హరినాథ్‌గౌడ, డా.మధు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా నాలెడ్జ్ సెంటర్

- కర్నూలు మెడికల్ కాలేజీలో మళ్లీ రగడ



కర్నూలు హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు మెడికల్ కాలేజీలో నార్త్ అమెరికా కేఎంసీ ఓల్డ్ స్టూడెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన నాలెడ్స్ సెంటర్ అండ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ మరోసారి వివాదానికి దారి తీసింది. రూ.50 కోట్ల వ్యయంతో కర్నూలు మెడికల్ కాలేజీలో వైద్య విద్య విజ్ఞానానికి సంబంధించిన నాలెడ్జ్ సెంటర్ భవనం నిర్మించడానికి అల్యూమి అసోసియేషన్ ప్రభుత్వానికి ప్రతిపా దనలు పంపింది. దీంతో పాటు క్రీడల భవనాన్ని నిర్మించాలని కూడా తలపెట్టారు. ఈ మేరకు గత వైసీపీ ప్రభుత్వం 2023 జూన్‌లో అనుమతి ఇస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అయితే మెడికల్ కాలేజీ ఆవరణలో నాలెడ్స్ సెంటర్ ఎక్కడ నిర్మించాలనే అంశంపై వివాదం నెలకొంది. కేఎంసీ మైదానంలోని రోడ్డు వైపు నిర్మించాలని అల్యూమి అసోసియేషన్ తలపెట్టింది. అయితే గ్రౌండ్ ఆటస్థలంలో 60 సెంట్లు కేటాయించడంపై జూనియర్ డాక్టర్లు, ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో తాత్కాలికంగా పనులు ఆపేశారు. మళ్లీ ఈ ఏడాది జూలై 28న నాలెడ్స్ సెంటర్ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టగా అప్పుడు ఏపీజీడీఏ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా.పి. బ్రహ్మాజీ మాస్టర్‌తో కొందరు ప్రొఫెసర్లు వైద్యులు, జూనియర్ డాక్టర్లతో కలిసి పూర్వ విద్యార్థుల సంఘం నేతలతో గొడవకు దిగారు. నాలెడ్జ్ సెంటర్ పేరుతో 60 సెంట్ల స్థలంలో భవనం నిర్మిస్తే అడ్డుకుంటామని హెచ్చరించడంతో పనులు ఆగిపోయాయి. సెప్టెంబరు 19వ తేదీ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డా. పి. చంద్రశేఖర్ మెడికల్ కాలేజీలో నాలెడ్జ్ సెంటర్ భవనం కోసం న్యూలెక్చరర్ గ్యాలరీకి ఎదురుగా ఉన్న స్థలాన్ని, మరో కొన్ని స్థలాలను పరిశీలించి అందరికీ ఆమోదయోగ్యమైన స్థలంలో నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సోమవారం కర్నూలు మెడికల్ కాలేజీ అభివృద్ధి కమిటీ సమావేశాన్ని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎంసీ అల్యూమి (ఎన్ఆర్ఐ) సంఘం నిర్మించతలపెట్టిన నాలెడ్జ్ సెంటర్ అంశం తెరమీదకు వచ్చింది. సంఘం రూ.50 కోట్లతో ఖర్చు చేసేందుకు ముందుకు వస్తే ఎందుకు అభ్యంతరం చెబుతున్నారో అర్థం కావడం లేదని మంత్రి వ్యాఖ్యానించారు. నాలెడ్జ్ సెంటర్‌కు 60 సెంట్ల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించాలని, దీన్ని కట్టకుండా అభ్యంతరాలు చెబుతున్న జూనియర్ డాక్టర్లు, ఏపీజీడీఏ వైద్యుల సంఘం నేతలతో మాట్లాడుతానని అన్నారు. పరిపాలనపరంగా తమకు ఎలాంటి ఇబ్బంది లేదని, ప్రభుత్వం ఆదేశాలను పాటిస్తామని ప్రిన్సిపాల్ మంత్రికి వివరించారు. ఆ తర్వాత కొందరు జూనియర్ డాక్టర్లతో మంత్రి మాట్లాడారు. ఏపీజీడీఏ వైద్యుల సంఘం అధ్యక్షుడు డా. బ్రహ్మాజీ మాస్టర్ సమావేశానికి వస్తుండగా.. మంత్రి వెళ్లడంతో వెనుదిరిగారు. ఎట్టి పరిస్థితుల్లో నాలెడ్జ్ సెంటర్‌ను కేఎంసీ గ్రౌండ్స్‌లో నిర్మించేందుకు అనుమతించమని డా. బ్రహ్మాజీ మాస్టర్ తేల్చి చెప్పారు. ఈ వ్యవహారం ఏ మలుపు తిరుగుతుందో వేచి చూడాలి.

దేశంపై భక్తి, గౌరవం కలిగి ఉండాలి

- అచలానంద ఆశ్రమం పీఠాధిపతి విరజానంద స్వామీజీ


ప్రకాశ్‌నగర్‌లోని ఆనంద నిలయంలో మాట్లాడుతున్న పీఠాధిపతి

కర్నూలు కల్చరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) ఈ దేశంలో జన్మించిన ప్రతి ఒక్కరికీ దేశం, ధర్మం, సమాజం పట్ల భక్తి, గౌరవ భావాలు ఉండాలని కడపజిల్లా, బ్రహ్మంగారిమఠం సమీపంలోని తోటపల్లి అచలానంద ఆశ్రమ పీఠాధిపతి విరజానంద స్వామీజీ ఉద్బోధించారు. సోమవారం నగరంలో సత్సంగ్ పర్యటన కార్యక్రమాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో స్వామీజీ భక్తులతో సమావేశమయ్యారు. నగర శివారులోని గోదా గోకుల క్షేత్రంలో భక్తులకు ఆధ్యాత్మిక బోధన చేశారు. జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల్లో యువతకు సందేశమిచ్చారు. అనంతరం ప్రకాశ్‌నగర్‌లోని ఆనంద నిలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రవచన బోధన చేశారు. సి. క్యాంపులోని టీటీడీ కళ్యాణ మంటపంలో గీతా కంఠస్థ పోటీల బ్రోచర్లను విడుదల చేశారు. బాలల్లో, యువతలో నైతిక విలువలు పెంచేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. గోకులంలో జరిగిన కార్యక్రమంలో మారం నాగరాజ గుప్త, పల్లెర్ల నాగరాజు, ప్రకాశ్‌నగర్‌లో పసుపుల ప్రకాశ్, ఇందిర, జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల్లో డాక్టర్ నాగఫణిశాస్త్రి పాల్గొన్నారు.

కోడి పందెంరాయుళ్ల అరెస్టు

- 10 బైకులు, స్కార్పియో, రూ.10,380 స్వాధీనం

బనగానపల్లె, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాదాసుపల్లె పరిసర ప్రాంతాల్లో కోడిపందాలు ఆడుతూ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు పక్కా సమాచారం రావడంతో దాడులు చేసి 10 బైకులు, స్కార్పియో వాహనం, రూ.10,380 నగదు, ఒక పందెం కోడిని స్వాధీనం చేసుకున్నట్లు బనగానపల్లె సీఐ ప్రవీణ్‌కుమార్ సోమవారం తెలిపారు. కొంత కాలంగా పందెంకోళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో మూకుమ్మడిగా దాడి చేశామన్నారు. అక్కడ సుమారు 40 మంది కోడి పందెంరాయుళ్లు కర్నూలు, నంద్యాల, బేతంచెర్ల మండలం కడప జిల్లాల నుంచి వచ్చి కోడి పందాల బెట్టింగ్ ఆట ఆడుతుండగా దాడి చేశామన్నారు. ఈదాడిలో పలువురు పారిపోగా ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మాదాసుపల్లెకు చెందిన వడ్డెరామదాసు, బలిజ రామసుబ్బయ్య ఆధ్వర్యంలో ఈకోడిపందాల బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కర్నూలు

కర్నూలు ● కోడుమూరు ● పాణ్యం

ఏ,బీ,సీ క్యాంపుల్లోనే హైకోర్టు బెంచ్



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి టీజీ భరత్

- రాష్ట్ర మంత్రి టీజీ భరత్
- మెడికల్ కళాశాల వద్ద విస్తరించిన రహదారి ప్రారంభం

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఏ, బీ, సీ క్యాంపుల్లోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తున్నట్లు పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం సాయంత్రం బుధవారపేట సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద రూ. 34.68 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణం, డ్రైయిన్స్‌ను ప్రారంభించి, కాంపౌండ్ వాల్ పనులకు ఎంపీ బస్తిపాటి నాగరాజు, కుడా ఛైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుతో కలిసి భూమి పూజ చేశారు. రెండు దశాబ్దాలుగా రోడ్డు ఇరుకుగా ఉండి, ప్రమాదాలు జరిగి పలువురు మరణించారన్నారు. మసీదు కమిటీ వారితో చర్చించి, అవసరం మేరకు నిర్మాణాలను తొలగించామన్నారు. నగరంలోని ఏబీసీ క్యాంపులలోనే హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేస్తామని, ఈవిషయం గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు సూచనల మేరకు ఏర్పాట్లు ఉంటాయని తెలిపారు. కిడ్స్ వరల్డ్ నుంచి బుధవారపేట వంతెన వరకు రహదారి విస్తరణ పనులు అందరి ఆమోదంతో చేస్తామన్నారు. కళ్యాణ్ జ్యువెలర్స్ నుంచి బుధవారపేటకు హంద్రీ నదిపై వంతెన నిర్మాణానికి ఆలోచనలు చేస్తున్నామన్నారు. కర్నూలులో నిర్వహించిన జాబ్ మేళాలో 900 మందికి ఉద్యోగాలు వచ్చాయని, డిసెంబర్ 8న కూడా మరో జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు.

ఎంపీ బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ మంత్రి టీజీ భరత్, అధికారులు చాకచక్యంగా సమస్యను పరిష్కరించారన్నారు. కమిషనర్ విశ్వనాథ్, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహా పర్వీన్, స్వామి రెడ్డి, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు అబ్బాస్, మసీదు కమిటీ సభ్యులు, ముత్తవల్లి పాల్గొన్నారు.

కర్నూలు అభివృద్ధికి కృషి

కర్నూలు నగరాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం గడియారం ఆస్పత్రి సమీపంలోని ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ ఉర్దూ హాస్టల్స్‌కు మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ టేకర్ కమిటీ ఆధ్వర్యంలో రిఫ్రిజిరేటర్లు, కుర్చీలు, ప్లేట్లు అందజేశారు. పేద ముస్లిం యువతులకు వివాహాలకు సాయం చేస్తున్నామని, వక్ఫ్ కాంప్లెక్స్ ఆవరణలో నిర్మాణంలో ఉన్న ఫంక్షన్ హాల్‌ను పూర్తి చేసేందుకు కృషి చేస్తామన్నారు. మైనార్టీ వెల్ఫేర్ అధికారి సయ్యద్ సబిహ పర్వీన్, కమిటి ప్రసిడెంట్ ఇబ్రహీం, రాష్ట్ర హజ్ కమిటి సభ్యులలు మన్సూర్ ఆలీ ఖాన్, జహంగీర్ బాషా, హమీద్, కేర్ టేకర్ కమిటి వైస్ ప్రసిడెంట్ మహబూబ్, రబ్బాని, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక చైతన్యం పెంచుకోవాలి

కర్నూలు అర్బన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సామాజిక చైతన్యం పెంచుకోవాలని ప్రిన్సిపాల్ ఇందిరాశాంతి అన్నారు. సోమవారం ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో ఎన్‌సీసీ డే వారోత్సవల ముగింపు సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. లెఫ్టినెంట్ కల్నల్ డా.ఆర్‌కే నాయక్ ఆధ్వర్యంలో 28వ బెటాలియన్ ఎన్‌సీసీ కార్యాలయం మీదుగా గాయత్రీ ఎస్టేట్, సి.క్యాంప్ వరకు 5 కీమీ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఆధ్యాపకుల హేమంత్ ఫక్రున్నీసా బేగం, శ్రీనివాస్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రైతన్నా మీ కోసం' విజయవంతం చేయాలి



భూసార పరీక్ష ఫలితాల పత్రాలను అందజేస్తున్న ఏవో

సి.బెళగల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిర్వహిస్తున్న 'రైతన్నామీకోసం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏవో మల్లేష్‌కుమార్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో భూసార పరీక్ష ఫలితాల పత్రాలను రైతులకు అందజేశారు. రైతు దేశానికి వెన్నెముక అన్నారు. 29వ తేదీ వరకు మండలంలో కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎస్టీయూ కార్యవర్గం ఎన్నిక

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్టీయూ జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. సలాంఖాన్ ఎస్టీయూ భవన్‌లో ఎన్నికల పరిశీలకుడు సూర్యుడు, రమణారెడ్డి పర్యవేక్షణలో అధ్యక్షుడిగా టీకే జనార్దన్, ప్రధాన కార్యదర్శిగా ఎం.చిన్న సుంకన్న, ఆర్థిక కార్యదర్శిగా ఎం.శ్రీధర్‌తో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

జెండర్ సమానత్వానికి కృషి చేయాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): జెండర్ సమానత్వానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ ఎ.సిరి పిలుపునిచ్చారు. నగరంలోని కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో సోమవారం గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ ప్రచారం 'జెండర్ సమానత్వం' పోస్టర్‌ను ఆమె ఆవిష్కరించారు. ఈ నెల 24 నుంచి డిసెంబరు 23 వరకు 'నయీ చేతన 4.0' - మార్పు కోసం ముందడుగు' పేరుతో అన్ని రాష్ట్రాలలో జెండర్ వివక్షకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. నూతన చైతన్యం 4.0 - మార్పు కోసం వికసిత గ్రామీణ భారత్ దిశగా సమ్మిళిత వృద్ధికి, ఆర్థిక సాధికారతకు మహిళలు ముందుండాలన్నారు.

రజకులకు శిక్షణ ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రజక సంఘం నాయకులు

కర్నూలు న్యూసిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): విశ్వకర్మ కౌశల్య యోజన కంద ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇవ్వాలని, రజక వృత్తిదారుల సంతం జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. గూడూరుకు చెందిన రజక వృత్తిదారులు 200 కుటుంబాలు దరఖాస్తు చేసుకున్నారని, వీరికి శిక్షణ ఇవ్వలేదన్నారు. నగర కార్యదర్శి సి.శేషాద్రి, సయమ్మ, శ్రీనివాసులు, మద్దిలేటి, సురేష్, ఎల్లరాజు తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యపై అవగాహన

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎస్ఏపీ క్యాంపు కట్టమంచి రామలింగారెడ్డి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు వృత్తి విద్యాకోర్సులపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వెంకటరెడ్డి, ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.నాగస్వామి నాయక్ మాట్లాడుతూ పదో తరగతి పూర్తయ్యాక ఒకేషనల్ కోర్సులు ఎంచుకుంటే త్వరితగతిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. అధ్యాపకులు ప్రసన్న కుమార్, విజయశేఖర్, సుజాత, గిరిజారాణి పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యసేవలు అందించండి

- పరీక్షల కోసం రోగులను బయటకు పంపకూడదు
- కేఎంసీ సమీక్షా సమావేశంలో మంత్రి టీజీ భరత్



మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కర్నూలు హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పెద్దాసుపత్రికి వచ్చే రోగులకు ఉత్తమ వైద్యసేవలు అందించాలని రాష్ట్ర మంత్రి టీజీ భరత్ ఆదేశించారు. సోమవారం ఉదయం జీజీహెచ్, మెడికల్ కాలేజీ అభివృద్ధి సమావేశాన్ని కేఎంసీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూరోగులను మందులు, పరీక్షలకు బయటకు పంపవద్దని సూచించారు. నెక్ట్స్‌జెన్ సాఫ్ట్‌వేర్‌ను వినియోగించుకుని పేపర్‌లెస్ సేవలు అందించాలని ఆదేశించారు. సూపరింటెండెంట్ డా.కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ జీజీహెచ్‌లో ఎంఎన్‌వో, ఎఫ్‌ఎన్‌వోలు 70 మంది మాత్రమే ఉన్నారనీ, 249మంది అవసరమని డీఎంఈకి ప్రతిపాదనలు పంపామన్నారు. మంత్రి మాట్లాడుతూ స్టేట్ క్యాన్సర్ హాస్పిటల్‌కు రూ.20 కోట్లు, విశ్రమ్ సదన్ కోసం తలపెట్టిన రోగుల సహాయకుల షెడ్, ఐసీయూలో ఎయిర్స్ కండీషన్, అనస్థీషియా వర్క్‌స్టేషన్ ఏర్పాటు, రోస్టర్ పాయింట్లు ప్రకారం చేస్తున్న పోస్టులు వివరాల నివేదికలు ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. ఆసుపత్రిలో అన్ని పరీక్షలు అందుబాటులో ఉండగా.. బయట ఉన్న రాయలసీమ ల్యాబ్‌కు రోగులను పంపడం కరెక్టు కాదని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై హెచ్‌డీఎస్ సభ్యుడు టి.సాయిప్రదీప్ మంత్రికి ఫిర్యాదు చేశారు. ఆసుపత్రిలో దొంగతనాలు జరుగుతున్నాయనీ సీసీ కెమెరాలు కొన్ని చోట్ల పనిచేయడంలేదని సెక్యూరిటీ గార్డులను పూర్తిస్థాయిలో నియమించలేదని సూపరింటెండెంట్ తప్ప ఎవరూ గదులను దాటి తనిఖీ చేయడం లేదని మంత్రికి ఫిర్యాదు చేశారు. కొందరు పీజీలు కమీన్లకు కక్కుర్తి పడి రాయలసీమ డయోగ్నస్టిక్ ల్యాబ్‌కు చిన్న చిన్న టెస్టులను పంపుతున్నారనీ, ఒక్కొక్క వైద్య విద్యార్థికి రూ.30వేల వరక కమీషన్ వస్తోందని మంత్రి దృష్టికి తెచ్చారు. ఇకపై ఒక్క పరీక్షను కూడా బయటకు పంపకూడదని మంత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ప్రిన్సిపాల్ డా.కే.చిట్టినర సమ్మ, స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ డా.కృష్ణ ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ డా.సాయి సుధీర్, హెచ్‌డీఎస్ సభ్యులు డా.ప్రవీణ్, రఘునాథరెడ్డి, జగదీష్, సాయిప్రదీప్, ఏపీఎంఎస్ఐడీసీ ఇంజనీర్లు పాల్గొన్నారు.

రైతుకు అండగా ప్రభుత్వం



నిడ్జూరులో రైతులతో ఎమ్మెల్యే

కర్నూలు రూరల్ నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని నిడ్జూరు గ్రామంలో సోమవారం రైతన్న మీకోసం'లో భాగంగా రైతులకు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు.

● పంచలింగాల గ్రామంలో ఎంపీ బస్తిపాటి నాగరాజు పాల్గొన్నారు. రైతు సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఎంపీ పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శి గోవర్దన్, టీడీపీ నాయకులు శంకర్, నాగరాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'టీబీ ముక్త్ భారత్ అభియాన్'ను వినియోగించుకోవాలి



హుశేనాపురంలో మాట్లాడుతున్న డా.రేఖ

ఓర్వకల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'టీబీ ముక్త్ భారత్ అభియాన్'ను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి డాక్టర్ రేఖ సూచించారు. సోమవారం హుశేనాపురం గ్రామంలో మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు, బరువు తగ్గిపోవడం పైబడిన వారు పౌష్టికాహార లోపం వున్న వారందరికీ టీబీ గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. నిరుపేద బాధితులుంటే దాతల సహకారంతో ప్రతి నెలా పౌష్టికాహారం అందించాలన్నారు. కార్యదర్శి ప్రభాకర్, హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ విలియమ్ రాబర్ట్, హెల్త్ సూపర్‌వైజర్ ప్రకాష్, టీబీ సూపర్‌వైజర్ నితీష్, హెల్త్ అసిస్టెంట్స్ రాజేంద్ర, షకీల, శ్రీదేవి, 104 సిబ్బంది, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పనికితగ్గ వేతనమివ్వాలి



ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

కోడుమూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు పనికి తగిన వేతనం ఇవ్వాలని సీఐటీయూ మండల కార్యదర్శి గఫూర్‌మియా డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో దర్నా చేశారు. చాలీచాలని వేతనంతో కుటుంబాలను పోషించలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరన్న, కుమారస్వామి, సూలమ్మ, అరుణ, నాగమ్మ, హైమావతి ఉన్నారు.

చిరుధాన్యాలతో అనారోగ్య సమస్యలకు విముక్తి

ఓర్వకల్లు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలను తీసుకుంటే మధుమేహం, ఇతర అనారోగ్య సమస్యల నుంచి బయట పడవచ్చని ఆరోగ్య నిపుణుడు డాక్టర్ ఖాదర్ వలి అన్నారు. సోమవారం ఓర్వకల్లులోని పొదుపు లక్ష్మీ మండల ఐక్యసంఘం ప్రాంగణంలో అవగాహన సదస్సు నిర్వహించారు. గౌరవ సలహాదారాలు విజయభారతి అధ్యక్షత వహించారు. డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ కొర్రలు, సామలు, అండుకొర్రలు, అరికెలు, ఊదలు, చిరుధాన్యాలను ఉపయోగిస్తే ఆరోగ్యం సాధ్యమన్నారు.

అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చే అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలని నగర పాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదేశించారు. సోమవారం నగర పాలక సమావేశభవనంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 23 అర్జీలు వచ్చాయని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. అడిషనల్ కమిషనర్ ఆర్‌జీవి.కృష్ణ, డిప్యూటి కమిషనర్ సతీష్‌కుమార్‌రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జి ఎస్ఈ శేషసాయి, ఎంఈ మనోహర్‌రెడ్డి, ప్రజారోగ్య అధికారి డా.నాగశివప్రసాద్, రెవెన్యూ ఆఫీసర్ జునైద్, టిడ్కో అధికారి పెంచలయ్య, మెప్మా సీఎంఎం భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్

● నగర శివారులోని డ్రైవర్స్ కాలనీ వార్త ఆఫీసు వెనుక సర్వే నెంబరు 165/3లో రోడ్డున ఆక్రమించుకుని నిర్మించిన ప్రహరీని తొలగించాలని కాలనీ వాసులు కోరారు.

బాల నరసింహులుకు డాక్టరేట్

కర్నూలు అర్బన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీ ఎకనామిక్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో కర్నూలు వాసి బాల నరసింహులుకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేశారు. ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ పర్యవేక్షణలో బాల నరసింహులు 'ఇంపాక్ట్ ఆఫ్ ఐటీడీఏ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ ఆన్ ప్రిమిటివ్ ట్రైబ్స్(చెంచూస్) అనే అంశంపై పరిశోధన చేశారు. కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల పరిధిలో స్టడీ చేశారు. రాయలసీమ వర్సిటీలో పని చేస్తూ పరిశోధనలు చేయడం పట్ల వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పరిశోధనలు చేయాలని ఆకాంక్షించారు.



మెప్మా సీఎంఎంగా శోభ

కర్నూలు న్యూసిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెప్మా సిటీ మిషన్ మేనేజర్‌గా నంద్యాల జిల్లాలో సీఎంఎంగా పని చేస్తున్న శోభను నియమిస్తూ ఆ శాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పనిచేస్తున్న భాస్కర్‌రెడ్డి నంద్యాలకు బదిలీ అయ్యారు. రెడుఉ రోజుల్లో రిలీవ్ కానున్నట్లు అధికారులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి పని చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు ప్రజలతో మమేకమై నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పనిచేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎంవి.నారాయణ అన్నారు. సోమవారం పాతబస్తీ హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో ఎస్ఎండీ షరీఫ్ సమావేశం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యం చేయాలన్నారు. రాజేంద్రబాబు, షేక్షా వలి, ఎర్ర శ్రీనివాసులు, శాలి భాష తదితరులు పాల్గొన్నారు.

దత్తతను ప్రోత్సహించాలి

కర్నూలు కలెక్టరేట్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక అవసరాలు (స్పెషల్ నీడ్స్) గల పిల్లల దత్తతను ప్రోత్సహించాలని కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సోమవారం సునయన ఆడిటోరియంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో దత్తత అవగాహన కార్యక్రమాలు-2025 పోస్టర్‌ను సంబంధిత అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి విజయ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అన్నదాతలే దేశానికి పునాది



గౌరు దంపతులను సన్మానిస్తున్న రామగిడ్డయ్య

కల్లూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలే దేశానికి పునాది అని పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి అన్నారు. రైతన్నా..మీ కోసంలో భాగంగా చిన్నటేకూరు గ్రామంలో సోమవారం పర్యటించారు. ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం చేపడుతున్న సంక్షేమ పథకాల బ్రోచర్‌ను పంపిణీ చేవారు. వ్యవసాయ పంచసూత్రాలు వివరించేందుకు రైతుల ఇళ్ల వద్దకే అధికారులు వచ్చి అవగాహన కలిస్తారన్నారు. నేల ఆరోగ్యానికి పంటమార్పిడి తప్పనిసరిగా పాటించాలని, ఖర్చు తగ్గించేందుకు ప్రకృతి వ్యవసాయం అన్ని గ్రామాలకు విస్తరించాలని కోరారు. ప్రభుత్వం అ అన్నదాతా సుఖీభవ కింద రూ.20 వేలు ఇచ్చిందన్నారు. వ్యవసాయ అధికారులు సాలురెడ్డి, జి. నాగశేషాచలరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, డైరెక్టర్. రామాంజనేయులు, ఉలిందకొండ, కల్లూరు సింగిల్‌విండో ఛైర్మెన్లు రమణ, డి. శేఖర్, సర్పంచు సహరాబి, చిన్నటేకూరు పాల్గొన్నారు.

● ఉప్పర, సగర కార్పొరేషన్ డైరెక్టర్‌గా కల్లూరు మండలం పర్లకు చెందిన రామగిడ్డయ్య ఎంపిక య్యారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి, గౌరు వెంకటరెడ్డి దంపతులను కలిసి సన్మానించారు.

సమగ్రశిక్ష ఉద్యోగుల సర్వీసు పెంచాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్నఉద్యోగులు

కర్నూలు ఎడ్యుకేషన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సర్వీసును 62 సంవత్సరాలకు పెంచాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్బంగా సీఐటీయూ ప్రధాన కార్యదర్శి అంజిబాబు, సంఘం కో ఛైర్మన్ మహ్మద్ రఫీ, చంద్రశేఖర్ రాజు మాట్లాడుతూ ఉద్యోగులు చాలీచాలని జీతాలతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని, ఈపీఎఫ్, ఈహెచ్ఎస్ హెల్త్ కార్డును అమలు చేయాలని కోరారు. అర్హులకు పదోన్నతులు ఇవ్వాలన్నారు. అనంతరం కలెక్టర్ డా.సిరికి వినతి పత్రం అందజేశారు. జేఏసీ సభ్యులు మధు, పుల్లన్న, కౌతాళం రామాంజనేయులు, సోమేశ్వరి, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న గౌడు, కోశాధికారి జగదీష్ పాల్గొన్నారు.

రగ్బీలో చాంపియన్లుగా కర్నూలు, తూర్పు గోదావరి



ప్రథమ స్థానంలో నిలిచిన కర్నూలు బాలుర జట్టు

కర్నూలు స్పోర్ట్స్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ విద్యామందిర్ క్రీడా మైదానంలో జరుగుతున్న 69వ స్కూల్ గేమ్స్ రగ్బీ పోటీల బాలుర విభాగంలో కర్నూలు జట్టు, బాలికల విభాగంలో తూర్పుగోదావరి జట్లు విజయం సాధించి కప్పు కైవసం చేసుకున్నాయి. మూడో స్థానంలో బాలికల విభాగంలో కాంస్యం సాధించింది. ఆదర్శ విద్యాసంస్థల డైరెక్టర్ డా.హరికిషన్, రాష్ట్ర రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు విజేతలకు ట్రోఫీలు, పతకాలు అందజేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీ రాఘవేంద్ర ఆచారి, క్రీడా పోటీల పరిశీలకులు గణేష్, పీడీ శేషయ్య, భాస్కర్ రెడ్డి, కిరణ్, మేనేజర్‌లు, కోచ్‌లు పాల్గొన్నారు. అనంతరం బాలబాలికల జట్లను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారు. జనవరిలో జరగనున్న జాతీయ స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 రగ్బీ ఛాంపియన్‌షి ప్‌లో పాల్గొంటారన్నారు.

బంకులను తొలగించాలి

కోడుమూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): జడ్పీ బాలరు, బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీకి ఆనుకుని వేసిన బంకులను తొలగించాలని ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా సోమవారం చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ రోడ్డు స్థలాన్ని ఆక్రమించి పాఠశాల గోడకు ప్రైవేటు వ్యక్తులు బంకులు ఏర్పాటు చేస్తుండటంతో విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎంపీడీవో రాముడుకు వినతి పత్రం అందజేశారు.

రోగికి అరుదైన ఆపరేషన్



రోగితో అమీలియో హాస్పిటల్ వైద్యులు

కర్నూలు హాస్పిటల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణానికి చెందిన 46 ఏళ్ల భవన కార్మికుడు చిన్నకేశవులుకు అమీలియో హాస్పిటల్‌లో వైద్యులు అరుదైన సీఏబీసీ ఆపరేషన్‌చేసి ప్రాణాన్ని నిలబెట్టారు. వివరాల మేరకు.. గుంతకల్లు చెందిన చెన్నకేశవులు ఛాతిలో నొప్పి, తీవ్ర ఆయాసంతో బాధపడుతున్నాడు. అనంతపురంలోని ఓ ప్రైవేటు హాస్పిటల్‌లో చెకప్ చేసుకుంటున్నారు. తగ్గక పోవడంతో ఈ నెల 9వ తేదీన అమీలియో హాస్పిటల్‌కు వచ్చారు. కార్డియోథొరాసిక్, సర్జన్ డా.భవానీ కొండూరీ అంజియోగ్రామ్ నిర్వహించి, 3 రక్తనాళాలు బ్లాక్ అయినట్లు నిర్ధారించి తర్వాత కార్డియాక్ ఎంఆర్ఐ నిర్వహించారు. ఈ నెల 15వ తేదీన ఆరోగ్యశ్రీ కింద కార్డియోక్ అనస్థీషియా వైద్యులు డా.అనిల్‌తో సిటి సర్జన్ డా.భవాజీ కొండూరి 4 గంటలు శ్రమించి సీఏబీజీ ఆపరేషన్ నిర్వహించారు. సోమవారం రోగిని డిశ్చార్జ్ చేశారు. కార్డియాలజిస్టు డా.ప్రతాప్ రెడ్డి, క్రిటికల్ కేర్ స్పెషలిస్టు డా.శ్రీనాథ్ రెడ్డి పాల్గొన్నారు.

మహిళా మార్ట్ అవినీతిపై విచారణ చేయాలి

కర్నూలు న్యూసిటీ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళా మార్ట్‌లో చోటుచేసుకున్న అవినీతిపై చేయించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్.రాధాక్రిష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద మెప్మా ఆర్పీలు ధర్నా చేశారు. పొదుపు మహిళల నుంచి రూ.66 లక్షల వసూలు చేసి జగనన్న మహిళా మార్ట్ మూతకు కారణమైన నాటి మెప్మా పీడీ నాగశివలీల, ఎల్‌హెచ్ జిలానీ అక్రమాలపై వెంటనే విచారణ చేయాలన్నారు. శ్రామిక మహిళా సంఘం కన్వీనర్ పి.నిర్మల, ఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షురాలు రుద్రమ్మ, కార్యదర్శి ఉమాదేవి, నాయకులు కన్యక, మహాలక్ష్మి, మంజుల, జ్యోతి, పర్వీన్ పాల్గొన్నారు.

నేడు చెన్నకేశవస్వామి రథోత్సవం

ఆలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మొలగవల్లి గ్రామంలో వెలిసిన చెన్నకేశవస్వామి రథోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించేందుకు గ్రామస్థులు ఏర్పాట్లు చేశారు. ఉదయం స్వామివారికి గంగపూజ, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, కుంకుమార్చన, మహామంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను నిర్వహిస్తామని అర్చకులు ఉదయప్రభవస్వామి తెలిపారు. భక్తులు పాల్గొని చెన్నకేశవస్వామి రథోత్సవం జయప్రదం చేయాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన వరి, వేరుశనగ దిగుబడులకు తక్షణమే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర కల్పించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి మల్లయ్య కోరారు. సోమవారం సబ్ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డ్‌లలో వ్యవసాయ పంట ఉత్పత్తులకు కనీస మద్దతు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు పత్తి కొనుగోళ్లలో నిబంధలను సడలించాలని కోరారు. కార్యక్రమంలో రైతులు హనుమంతు, యోహాన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

దేవనకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): 2024-25 లో జరిగిన ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ జరగనున్నట్లు ఏపీవో రాజునాయక్ తెలిపారు. ఈ నెల 28 నుండి వచ్చే ఏడాది జనవరి 7 వరకు ఆయా గ్రామాల పరిధిలో జరిగిన ఉపాధి పనులపై సమగ్ర విచారణ జరుగుతుందన్నారు. గతంలో స్టేట్ రిసోర్స్ పర్సన్‌తో సోషల్ ఆడిట్ చేసేవాళ్లని, ఈ ఏడాది నుండి జిల్లా రిసోర్స్ పర్సన్స్ సోషల్ ఆడిట్ చేస్తారని అన్నారు.

పదోన్నతి కల్పించాలి

పత్తికొండ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు, రైతులకు సేవలందిస్తున్న వీఆర్‌ఏలను వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నారాయణస్వామి, మండల కార్యదర్శి రవిచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆర్డీఓ భరత్‌నాయక్‌కు వీఆర్‌ఏల సమస్యలపైన వినతి పత్రం అందించారు. చెన్నప్ప, తిమ్మ, చంద్రయ్య, సూరి, అంజి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదాతకు అండగా ప్రభుత్వం


సభలో మాట్లాడుతున్న టీడీపీ ఆలూరు ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి

ఆలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి అన్నారు. సోమవారం రాత్రి ఆలూరు మండలం హులేబీడు గ్రామంలో రైతన్నమీకోసం... అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నాడన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతులకు పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పథకం పేరుతో రైతులను ఆదుకుంటున్నాడన్నారు. టీడీపీ నాయకులు కురువ రఘుబాబు, కేశన్న, అతిథి హోటల్ షేక్షా, కూపేంద్ర, కొండ రామాంజినేయులు పాల్గొన్నారు.

ఆదోని రూరల్ : రైతులను రాజులను చేయడమే కూటమి ప్రభుత్వం ముందున్న లక్ష్యమని టీడీపీ సీనియర్ నాయకుడు ఉమాపతి నాయుడు తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రైతున్న మీ కోసం వారోత్సవాలు ఆదోని మండలం ఆరేకల్లులో ఏడిఏ బాలవర్ధిరాజు, ఏఓ సుధాకర్‌ల ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభం అయ్యాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ రామకృష్ణ, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, నాయకులు రంగస్వామి నాయుడు, గణేకల్లు విరుపాక్షి పాల్గొన్నారు.

తుగ్గలి:రైతులు ప్రతి ఏటా సాగు చేసిన పంటల్లో మార్పులు చేయకపోవడంతో నష్టపోతున్నారనీ, రైతులను అభివృద్ధి చేయడమే లక్ష్యమని మండల వ్యవసాయాధికారి సురేష్ యాదవ్, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు అన్నారు. సోమవారం మండలంలోని రాంపల్లి, తుగ్గలి, తదితర గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి పంచ సూత్రాలను వివరించారు. ఏఈవోలు లక్ష్మీనారాయణ, బాలసరస్వతి, లోహిత్, టీడీపీ నాయకులు హేమాద్రి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర:రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రైతుల పక్షపాతి అని, ఇది రైతుల ప్రభుత్వం అని మాజీ జడ్పీటీసీ సభ్యులు జమేదార్ రాజన్న యాదవ్, వ్యవసాయ శాఖ అధికారి రవి తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన మద్దికెరలో రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం అనే కరపత్రాలను రైతుల ఇళ్లకు వెళ్లి అందజేసి ప్రభుత్వం రైతుల కోసం చేసే పథకాలను వివరించారు

దేవనకొండ: రబీలో రైతులు నీటి లభ్యత మేరకు పంటలను సాగు చేయాలని ఏవో ఉషారాణి తెలిపారు. మండలంలోని మాచాపురం, ఈదుల దేవరబండలో రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు సంక్షేమం కోసం తీసుకుంటున్న పథకాలు, సాగుకు అవసరమయ్యే పద్ధతులు, వివరించారు. మండలంలోని అన్ని గ్రామాలలో సచివాలయ ఉద్యోగులు రైతన్న మీకోసం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.మాజీ సింగిల్ విండో అధ్యక్షులు చంద్రశేఖర్ చౌదరి, మండల టీడీపీ అధ్యక్షులు ఎస్. లక్ష్మీనారాయణ, పట్టణ టీడీపీ అధ్యక్షుడు గద్దం రామాంజులు, టీడీపీ నాయకులు గొడుగు సతీష్ కుమార్, బొల్లాపురం చంద్ర, వ్యవసాయ సిబ్బంది ఆనంద్ ఉన్నారు.

ఆస్పరి: మండలంలోని నగరూరు గ్రామంలో రైతన్న మీకోసం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామ టీడీపీ నాయులు విజయ్‌గోపాల్, ఎల్లప్ప మాట్లాడుతూ సీఎం చంద్రాబునాయుడు వ్యవసాయాన్ని అభివృద్ధి చేసేందుకు నూతన ఆలోచన విధానాలను లాభసాటిగా వ్యవసాయం చేసుకునేలా రైతులకు నూతన టెక్నాలజీని పరిచయం చేస్తుండడం హర్షణీయమన్నారు. రైతులు సాంకేతికతను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఠోబ, తిమ్మరాజు, రంగప్ప పాల్గొన్నారు.

'అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారిస్తున్నాం'

ఆదోని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ చేస్తున్నామని జిల్లా రిజిస్టర్ భార్గవ్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఆదోని సబ్ రిజిస్టర్ కార్యాలయంకు చేరుకుని అక్రమ రిజిస్ట్రేషన్‌పై విచారణ చేపట్టారు. జీవించి ఉన్న వ్యక్తిని మరణించినట్లు నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడంతో పాటు, నకిలీ వ్యక్తులను ఏర్పాటు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు విచారణలో తేలుతుందన్నారు. మోసగాళ్లు మొదటగా బాధితుడు విట్టల్‌రావు బతికి ఉండగానే, ఆయన మృతి చెందినట్లు నకిలీ సర్టిఫికెట్‌ను సృష్టించినట్లు సమాచారం ఉందని సంఘటనపై విచారణ జరుగుతున్న విషయాన్ని ధ్రువీకరించారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఇలాంటి మోసాలకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని జిల్లా రిజిస్టర్ భార్గవ్ హెచ్చరించారు.

నేడు ఆసుపత్రి భవనం ప్రారంభం

ఆలూరు, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రెండేళ్ల క్రితం ఆలూరు పట్టణంలో నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి భవనం రాజకీయ గ్రహణంతో ఇన్నాళ్లూ ఆరంభానికి నోచుకోలేదు. ప్రస్తుత నాయకుల చొరవతో ఎట్టకేలకు మంగళవారం ప్రారంభోత్సవం కానుంది. ఈ కార్యక్రమానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, జిల్లా కలెక్టర్ డా.సిరి, ఎమ్మెల్యే విరుపాక్షి, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జి వైకుంఠం జ్యోతి హాజరై ప్రారంభోత్సవం చేస్తారని ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వహీద్ తెలిపారు.

శ్మశాన స్థలాన్ని కాపాడాలి

వెల్దుర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి):మండలంలో మదార్‌పురం గ్రామంలో ఉన్న శ్మశాన స్థలాన్ని కాపాడాలని మదార్‌పురం గ్రామస్థులు కోరారు. సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్‌వర్మకు వినతి పత్రం సమర్పించారు. గ్రామస్థులు మాట్లాడుతూ పూర్వం నుంచి గ్రామంలో చనిపోయిన వారికి ఈ స్థలంలో అంత్యక్రియలు చేస్తున్నామన్నారు. ఇతరులెవరికి ఈ భూమిపై హక్కులు లేవని అన్నారు కార్యక్రమంలో డీటీ గురుస్వామిరెడ్డి, మదార్‌పురం గ్రామస్థులు పాల్గొన్నారు.

ఉర్దూ అకాడమీ చైర్మన్ నియామకంపై హర్షం

ఆదోని టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్‌గా ఎంపికైన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ షుబ్లీని సమితి రాష్ట్ర కార్యదర్శి నూర్ అహ్మద్ సోమవారం విజయవాడలోని ఆయన కార్యాలయంలో కలిసి అభినందించారు.. ఆయన ఆధ్వర్యంలో ఉర్దూ భాషాభివృద్ధికి కృషి చేస్తారన్న విశ్వాసం ఉందన్నారు.

పంచాయతీ కార్యదర్శిని నియమించాలి

ఆలూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని సీపీఎం ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి. హనుమంతు, ప్రాంతీయ నాయకులు కృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం బృందం ఎంపీడీఓ మద్దిలేటిస్వామికి వినతి పత్రం అందజేశారు. సీపీఎం ఆలూరు నాయకులు విటల్, రమేష్, ఎల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమానికి ఎమ్మార్పీఎస్ మద్దతు

ఆదోని టౌన్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) : ఆదోని జిల్లా ఏర్పాటు కోసం గతవారం రోజులుగా నిరాహార దీక్షలు చేపట్టిన జిల్లా సాధన సమితికి సోమవారం ఎంఆర్‌పీఎస్ నాయకులు ర్యాలీగా వచ్చి తమ మద్దతులను ప్రకటించారు. ఆదోని నియోజకవర్గం ఇన్‌చార్జి బండారి గిడ్డయ్య, ఎంఎస్‌పీ కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి బండారి హనుమంతు, జిల్లా నాయకులు పీఎస్ వీరేష్ మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా నాయకులు మాట్లాడుతూ ఆదోని డివిజన్ ప్రాంతం తీవ్రమైన కరువుతో అల్లాడుతుందని ఈ డివిజన్ అభివృద్ధికి జిల్లా ఏర్పాటు చేయడం ఒక్కటే మార్గమని అన్నారు. ఆదోని టౌన్ ఇన్‌చార్జి గుమ్మల బాలస్వామి, జగన్ మాదిగ పాల్గొన్నారు.

కార్యకర్త కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ఆదోని, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆదోని మండలం కడితోట గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక సభ్యుడు రాఘవేంద్ర ఐదు నెలల క్రితం ప్రమాదవశాత్తు ఫ్యాక్టరీలో మరణించారు. ఈ నేపథ్యంలో ఆదోని జనసేన పార్టీ ఇన్‌చార్జి మల్లప్ప ఆదేశాల మేరకు కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. జనసేన పార్టీ ముఖ్య నాయకులు నాగేంద్రబాబు చేతుల మీదుగా చెక్కును మృతిచెందిన కార్యకర్త కుటుంబ సభ్యులకు అందజేశారు కడితోట గ్రామ పంచాయతీ జనసేన పార్టీ ఇన్‌చార్జి శాంత పాల్గొన్నారు.

'దరఖాస్తు చేసుకోండి'

మద్దికెర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):మండలంలో అర్హులైన వారు ఇళ్లు నిర్మించుకోవడం కోసం ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ తెలిపారు. మద్దికెర, బురుజుల గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించారు.

తుగ్గలి: అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఇంటి నిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విశ్వమోహన్ తెలిపారు. ఖాళీ స్థలాన్ని జియో ట్యాగింగ్ చేసి నిర్మాణం చేసేటప్పుడు జియో ట్యాగ్ చేయాలని అలాగే పూర్తయిన తర్వాత కూడా జియో ట్యాగింగ్ చేస్తే పూర్తి బిల్లు వస్తుందన్నారు.



'విత్తనాలు వెనక్కి పంపించాం'

మద్దికెర, నవంబరు 24 (ఆంధ్ర జ్యోతి):మండలంలో రైతులు రబీలో సాగు చేసుకునేందుకు ప్రభుత్వం సరఫరా చేసిన రాయితీ, పప్పుశనగ విత్తనాలు రైతులు తీసుకోకపోవడంతో 130 కిలోల బ్యాగులు కర్నూలు గోడౌన్‌కు పంపామని తెలిపారు. సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్, రబీలో సాగు చేసిన పత్తి పంటలకు ప్రభుత్వమే రూ.7,600ల ప్రకారం కొనుగోలు చేస్తుందన్నారు. రైతులు సీసీఐ చేయించుకున్న తర్వాత మార్కెట్‌కు తీసుకెళ్లాలన్నారు. ఎప్పటికప్పుడు పత్తిని కోత కోసి తీసుకెళ్లాలన్నారు. పత్తి తేమ శాతం ఉండకూడదని సూచనలు చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

వెల్దుర్తి, నవంబరు 24(ఆంధ్రజ్యోతి) వెల్దుర్తిలో గుర్తు తెలియని వ్యక్తి సోమవారం మృతి చెందాడు. ఈ వ్యక్తి వెల్దుర్తిలో భిక్షాటన చేసుకొని డోన్ వైపు రైల్వేగేట్ల వద్ద ఉన్న నీటి సంపు వద్ద రోజు నిద్రపోయేవాడు. సోమవారం ఉదయం అక్కడ ఆయన విగతజీవిగా పడి ఉండడం స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం చేరవేశారు. పోలీసులు ఘటనస్థలికి చేరుకొని పంచాయతీ కార్మికుల చేత అంత్యక్రియలు నిర్వహించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

'ఇవి బూటకపు ఎన్‌కౌంటర్లు'



పత్తికొండలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న రామచంద్రయ్య

పత్తికొండ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను బూటకపు ఎన్‌కౌంటర్‌లు చేస్తున్నారని, వీటిని నిలిపి వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామచంద్రయ్య కేంద్రాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మావోయిస్టులపై బూటకపు ఎన్‌కౌంటర్‌లను నిరసిస్తూ స్థానిక సీ.ఆర్.భవన్ నుంచి పార్టీ ఆధ్వర్యంలో కార్యకర్తలు నిరసన ర్యాలీ చేశారు. సీపీఐ మండల, పట్టణ కార్యదర్శులు కారుమంచి, రామాంజనేయులు, ప్రజా సంఘాల నాయకులు గురుదాస్, వెంకటరామిరెడ్డి, కారన్న, నెట్టి, ఉపేంద్ర, అల్తాఫ్, నాగేంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదోని అగ్రికల్చర్ : అటవీ సంపదలను బడా కార్పొరేట్లకు కట్టబెట్టే ఆపరేషన్ కగార్‌ని వెంటనే నిలుపుదల చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున, సీపీఐ పట్టణ కార్యదర్శి వీరేష్, సీపీఎం నాయకులు గోపాల్, పీవోడబ్ల్యూ మహిళా సంఘం కార్యదర్శి మణి, మానవ హక్కుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సీపీయూఎస్‌ఐ కార్యదర్శి కోదండ డిమాండ్ చేశారుఐఎఫ్‌టీయూ నాయకులు వెంకప్ప రైతు కూలీ సంఘం నాయకుడు ప్రసాద్, ఏసేబు ఆదినారాయణ రెడ్డి, రాజు సుజ్ఞానమ్మ చౌరప్ప పాల్గొన్నారు.

వీరభద్రస్వామి ఆలయంలో పూజలు

ఆస్పరి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కైరుప్పల గ్రామంలో వెలిసిన భద్రకాళి, వీరభద్రస్వామి ఆలయంలో సోమవారం కార్తీకమాస పూజలు ఘనంగా నిర్వహించారు. కైరుప్పల గ్రామ ప్రజలతో పాటు సమీప గ్రామాలైన కలపరి, పుష్పాలదొడ్డి, వెంగళాయదొడ్డి, కారుమంచి, పుటకలమర్రి, వలగొండ గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. వరప్రసాద్‌బాబు, వీరేష్, శేషరెడ్డి, నరసప్ప, మహేష్, రంగేష్, పరమేష్ పాల్గొన్నారు.

చెరువులో మొసలి

● ఏఐ ఫొటోతో భయాందోళనకు గురైన ప్రజలు

దేవనకొండ, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కరివేముల చెరువులో మొసలంటూ వాట్సప్ గ్రూప్‌లో హల్‌చల్ చేయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. గ్రామస్థులు యువకుల్ని విచారించగా, చెరువులో మొసలి లేదని, చేపల వేట నివారణకు ఇలా సెట్టింగ్ చేసినట్లు తెలిపారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు ఏఐ సాంకేతికతతో చెరువులో మొసలి ఉన్నట్లు ఫొటోని వాట్సప్ గ్రూప్‌లో పెట్టినట్లు తెలిసింది. గ్రామస్థులు యువకులపై కోపోద్రిక్తులు అయ్యారు.

జయప్రదం చేయాలి

పత్తికొండ టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టే దేశవ్యాప్త నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని సీపీఎం, సీపీఐ, సీఐటీయూ, మండల కార్యదర్శులు వెంకటేశ్వరరెడ్డి, కారుమంచి, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు రంగన్న, నెట్టికంటయ్యలు కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల నాయకులు గోపాల్, కారన్న, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

'కాళ్లరిగేలా తిరిగినా.. అధికారులు కనికరించడం లేదు'

తుగ్గలి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి):కొన్నేళ్ల క్రితం పొలాన్ని కొన్నాం.. కొన్న పొలానికి సంబంధించిన అన్ని రికార్డులు ఉన్నా ఆన్‌లైన్ చేయాలని కోరుతూ కార్యాలయం చుట్టూ ప్రదిక్షణలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రమైన తుగ్గలి తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేధికకు వచ్చి తహసీల్దార్ రవికి బొండ్లవానిపల్లెకు చెందిన రైతు మోహన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అంజన్ ప్రసాద్‌లు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 464 సర్వే.నెంబరులో నాలుగెకరాల పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రీసర్వే చేసినప్పుడు కేవలం మూడెకరాల 17 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్ చేశారు. దీంతో మిగిలిన పొలం అంతా మిగులు భూమిగా ఉంది. ఆ పొలాన్ని కూడా ఆన్‌లైన్ చేయాలని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని రైతు వాపోయాడు

సమావేశానికి అధికారుల డుమ్మా

మద్దికెర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు డుమ్మా కొట్టడంతో తమ సమస్యలపై వినతులు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు వెనుదిరాగాల్సిన దుస్థితి నెలకొంది. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 12 శాఖల అధికారులు పాల్గొనాల్సి ఉండగా.. తహసీల్దార్ గూండాల్ నాయక్ ఒకే ఒక్కరూ హాజరు కాగా, ఏ అధికారి రాలేదు. తహసీల్దార్ గూండాల్ నాయక్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులకు సమచారం ఇచ్చామని, కొంత మంది మాత్రమే వచ్చారన్నారు... మరి కొంత మంది హాజరు సంతకాలు పెట్టి వెళ్లారని వివరణ ఇచ్చారు.

షరతులు లేకుండా పత్తి కొనాలి

ఆదోని రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : షరతులు లేకుండా రైతులు పండించిన పత్తిని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతు సంఘం గౌరవ అధ్యక్షుడు లక్ష్మీ రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ షరతుల వలన రైతులు పండించిన పంటలను నష్టానికి అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏలాంటి షరతులు లేకుండా పత్తి కొనుగోలు చేయాలని వారు డిమాండ్ చేశారు. గోపాల్, సుదర్శన్, భీమన్న, తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలి

ఆదోని అగ్రికల్చర్, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాలలో పనులు లేక పట్టణాలకు వలసలు వెళుతున్నారని తక్షణమే విద్యార్థుల కోసం సీజనల్ హాస్టల్ లను ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అఖండ కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ కొండయ్యకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రసూల్, మహాదేవ, వీరేష్ వంశీ పాల్గొన్నారు.

అరుణ్ కుటుంబానికి ఆర్థిక సాయం

మద్దికెర, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్దికెర మండల కేంద్రమైన మద్దికెర మేజర్ గ్రామ పంచాయతీ కార్మికుడుగా పని చేస్తూ మృతి చెందిన అరుణ్ కుటుంబానికి సర్పంచ్ బండారు సుహాసిని, పంచాయతీ కార్యదర్శి శివకుమార్, పంచాయతీ సలహాదారులు బండారు ఆంజనేయులు రూ.30వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీలో కార్మికుడుగా పని చేస్తూ నీళ్లు వదలడం, పైపులైన్ మరమ్మతులు పని చేస్తూ జీవించేవాడని, ఈయన మృతి చాలా బాధాకరమని అన్నారు.

గృహాల కోసం దరఖాస్తు చేసుకోండి


మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య, ఏఈ వీరేంద్ర

మంత్రాలయం, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం నియోజకవర్గంలో 2.0 కింద డిమాండ్ సర్వేలో నమోదు చేసుకున్న లబ్ధిదారులు గృహాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని హౌసింగ్ డీఈ లాల్ కృష్ణయ్య, ఏఈ వీరేంద్ర అన్నారు. సోమవారం హౌసింగ్ కార్యాలయంలో మాట్లాడుతూ నియోజకవర్గంలోని కోసిగి, కౌతాళం, మంత్రాలయం పెద్దకడుబూరు మండలాల్లో దాదాపు 8 వేల మంది డిమాండ్ సర్వేలో నమోదు చేశారని, ఆయా గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో జియో ట్యాగింగ్ చేసి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని కోరారు. స్థలం ఉన్నా, లేకున్నా ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రూ.1.80 లక్షలతో పాటు, ఎస్సీ, బీసీలకు అదనంగా రూ.50వేలు, ఎస్టీలకు అదనంగా రూ.75వేలు ప్రభుత్వం ఇస్తుందన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్మించిన ఎన్టీఆర్ గృహ నిర్మాణంలో పూర్తయిన వాటికి త్వరలో బిల్లులు కూడా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేస్తుందన్నారు. ఆయా గ్రామాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఇంటింటికి తిరిగి గృహాలకు అర్హులైన లబ్ధిదారులకు జియో ట్యాగింగ్ చేస్తూ ఆన్‌లైన్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మన్న పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి


ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

కౌతాళం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరి పంటను సాగు చేసిన రైతులకు తాము పండించిన వరి పంటను అమ్ముకునేందుకు కౌతాళంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ మండలంలో ఇప్పటికే అధిక వర్షాల వల్ల పత్తి, మిరప, వేరుశనగ పంటలు పూర్తిగా దెబ్బతినడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వరిధాన్యాన్ని కొనుగోలు చేయాలంటూ ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు హనుమంతు, ప్రకాష్ ఉన్నారు.

పత్తికి రూ.12వేలు మద్దతు ధర కల్పించాలి


నందవరం సచివాలయంలో వినతిపత్రం ఇస్తున్న జిల్లా రైతు సంఘం నాయకులు

కోసిగి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పత్తి రైతులకు మద్దతు ధర కల్పించాలని, క్వింటం పత్తికి రూ.12వేలు మద్దతు ధర ఇవ్వాలని రైతు సంఘం తాలుకా అధ్యక్షుడు ఎం.గోపాల్ తెలిపారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు మేరకు పత్తికి మద్దతు ధర కల్పించాలని కోసిగిలోని సచివాలయం-4లో ఉద్యోగికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు ఓంకార్ స్వామి, నరసింహులు, ఈరన్న, తదితరులు పాల్గొన్నారు.

నందవరం: రైతుల దగ్గర నుంచి సీసీఐ అధికారులు, ప్రభుత్వం పత్తిని షరతులు పెట్టకుండా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సోమవారం నందవరం సచివాలయం ముందు రైతు సంఘం ఆధ్వర్యంలో తాలుకా నాయకులు శాంతప్ప, మండల కార్యదర్శి గిడ్డయ్య దర్నా చేపట్టి అనంతరం సచివాలయం అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు మాట్లాడుతూ క్వింటం పత్తిని రూ 12 వేలకు కొనాల్సిందేనని డిమాండ్ చేశారు. 24 నుంచి 30వ తేదీ వరకు ప్రతి సచివాలయం దగ్గర రైతులను ఆదుకోవాలని వినతిపత్రాలు ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవరాజు, ముని, ఈరన్న, ఏసన్న, పాండు, రామాంజి పాల్గొన్నారు.


రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ


రచ్చుమర్రి గ్రామంలో రైతన్న మీకోసం కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి, అధికారులు

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రావు

గోనెగండ్ల, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): రైతన్నలకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళల అండగా ఉంటుందని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం ప్రభుత్వం ప్రారంభించిన రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి తిప్పనూరు గ్రామంలో ప్రారంభించారు. గ్రామంలోని రైతులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతన్న కోసం వారి సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారానికి మర్గం చూపేందుకు గాను సీఎం చంద్రబాబునాయుడు సోమవారం నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు వారోత్సవాల కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఏడు రోజులు జరిగే ఈ కార్యక్రమాన్ని రైతు సేవా కేంద్రాన్ని యూనిట్‌గా తీసుకొని 24 నుంచి 29 వరకు రైతు సేవా కేంద్రం సిబ్బంది ప్రతి రైతు ఇంటికి వెళ్లి ప్రత్యక్ష వరామర్శ చేపడతారన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని ఉపయోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం రైతుల శ్రేయస్సుకోసం ఎంతో పాటు పడుతుందన్నారు. పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని తెలిపారు. రైతులకు సకాలంలో పంటలకు నీరు అందిస్తామని తెలిపారు. అనంతరం గ్రామస్తులు గ్రామంలోని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ మహమ్మద్‌ఖాద్రీ, ఏవో హేమలత, మండల టీడీపీ కన్వీనర్ తిరుపతయ్యనాయుడు, బేతాలబడేసా, నజీర్, నూరహమ్మద్, తిమ్మారెడ్డి, రమణ చౌదరి, జనసేన నాయకులు గానుగబాషా టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

కోసిగి: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు పల్లెపాడు రామిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్మన్ చింతలగేని నర్సారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ నాడిగేని అయ్యన్నలు అన్నారు. సోమవారం దుద్ది గ్రామంలో మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి ఆదేశాల మేరకు మండల వ్యవసాయాధికారి ఎం.వరప్రసాద్, ఏడీ వెంకట సుబ్బయ్య ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రైతన్నా మీ కోసం కార్యక్రమంలో భాగంగా దుద్ది గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారిణి ఇంద్రాణి, సహకార సంఘం బ్యాంకు సీఈవో హేమంత్‌రాజు, మాజీ జడ్పీటీసీ తోవి రామకృష్ణ, టీడీపీ నాయకులు జ్ఞానేష్, వక్రాణి వెంకటేశ్, సాతనూరు కోసిగయ్య, గాలెం వీరేష్, మదిరి వీరారెడ్డి, సొట్టయ్య, అంజినేయ, రామిరెడ్డి, ఈరయ్య, వీరారెడ్డి, తదితరులు ఉన్నారు.

ఎమ్మిగనూరు రూరల్: కూటమి ప్రభుత్వ హయాంలోనే రైతుల అభివృద్ధి జరుగుతుందని టీడీపీ మండల కన్వీనర్ కె.టి వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం కె.తిమ్మాపురం గ్రామంలో రైతన్న నీకోసం- అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీల గురించి వివరించారు. కార్యక్రమంలో రంగన్న, ఉరుకుందు, అంపయ్య, శ్రీరాములు, చంద్రలు పాల్గొన్నారు.

పెద్దకడబూరు: రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టీడీపి రాష్ట్ర రైతు సంఘం అధికార ప్రతినిధి రమాకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రమైన పెద్దకడబూరులోని ఏవో సుచరిత ఆధ్వర్యంలో రైతుల ఇంటి దగ్గరకి వెళ్లి అన్నదాత- సుఖీభవ పథకం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపి నాయకులు బసలదొడ్డి ఈరన్న, మీసేవ అంజినేయులు, మల్లికార్జున, ఏసేపు, బసలదొడ్డి మల్లికార్జున, మోట్రు రామాంజినేయులు, వీరేష్ గౌడ్ పాల్గొన్నారు.

ఏడాదైనా ఇంటి స్థలం ఇవ్వరా..?

- బాధితురాలు గోవిందమ్మ ఆవేదన


తహసీల్దార్‌తో మాట్లాడుతున్న గోవిందమ్మ

ఎమ్మిగనూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారులు ఎమ్మిగనూరు పట్టణంలో ఇంటి స్థలం ఇస్తామని ఏడాది క్రితం చెప్పారని.. ఏడాది గడచినా ఇంటి స్థలం ఇవ్వారా అంటు పెద్దకడుబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన గోవిందమ్మ తహసీల్దార్ ముందు ఆవేదన వ్యక్తం చేసింది. సోమవారం ఎమ్మిగనూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగి ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజాసంఘాల నాయకులతో పాటు గోవిందమ్మ తహసీల్దార్ శేషఫణిని కలిసి తన గోడును వెళ్లబోసుకుంది. బాధితురాలు గోవిందమ్మ, ప్రజా సంఘాల నాయకులు చార్లెస్, బతకమ్మ, మాల రంగయ్యలు మాట్లాడుతూ గత ఏడాది పెద్దకడుబూరు మండలం కల్లుకుంటలో దళితురాలైన గోవిందమ్మపై బీసీలు దాడిచేయటం జరిగిందన్నారు. ఈ సంఘటనపై పెద్దకడుబూరు స్టేషన్‌లో నిందితులపై ఎస్సీఎస్టీకేసు నమోదు అయ్యిందన్నారు. బాదితురాలు, ప్రజా,దళితసంఘాలు పెద్దఎత్తున ఆందోళనలు చేశారన్నారు. ఇందుకు స్పందించిన అప్పటి ఉన్నతాధికారులు బాధితురాలు గోవిందమ్మకు ఎమ్మిగనూరులో మూడు సెంట్ల ఇంటి స్థలం ఇవ్వాలని స్థానిక అధికారులను ఆదేశించారన్నారు. అయితే ఏడాది గడచినా ఇంటి స్థలం కేటాయించటంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థలం ఇవ్వకపోతే ఆందోళనలు ఉదృతం చేస్తామని హెచ్చరించారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ మిలటరీ కాలనీలో 70వ నెంబర్ పట్టా ఖాళీగా ఉందని తెలిసిందని, మరో సారి పరిశీలించి ఆ స్థలాన్ని బాధితురాలికి ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో నవ్యాంధ్ర ఎంఆర్‌పీఎస్, మాలమహానాడు నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మాచాని సోమప్ప పాఠశాలలో 75వ ఎన్‌సీసీ దినోత్సంను అడ్మినిస్ట్రేటివ్ కృష్ణయ్య అధ్వర్యంలో ఎన్‌సీసీ క్యాడెట్స్ ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆయన ఎన్‌సీసీ జెండా పతాకవిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ నెల నాలుగో వారం వార్షికోత్సవం జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ ఆఫీసర్‌లు కళ్యాణి, మణి గౌతంలు పాల్గొన్నారు.

నిరుద్యోగులను పట్టించుకోని ప్రభుత్వాలు


మంత్రాలయంలో మాట్లాడుతున్న నాయకులు

మంత్రాలయం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏఐవైఎఫ్ తాలాకా అధ్యక్షులు రెడ్డిజాఫర్ పటేల్, మండలాధ్యక్ష,కార్యదర్శులు చిన్న, రాజు అన్నారు. సోమవారం మంత్రాలయం మండలం చెట్నహళ్లిలో ఏఐవైఎఫ్ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం కొత్త కమిటీని మండల ఉపాధ్యక్షులు విజయ్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఇందులో అధ్యక్షులుగా దావీదు, ఉపాధ్యక్షులుగా ప్రవీన్, నవీన్‌లను ఎంపిక చేసినట్లు తెలిపారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలో విఫలమయ్యారన్నారు.

శ్మశానవాటికకు రోడ్డు వేయండి

మంత్రాలయం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో శ్మశానవాటికకు రోడ్డు వేయాలని జైభీమ్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు చిక్కిం జానయ్య అన్నారు. సోమవారం కర్నూల్‌లో ప్రజా సమస్యల వేదికలో భాగంగా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు.కార్యక్రమంలో జైభీమ్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ప్రశాంత్‌కుమార్, ఆదాము, డేవిడ్, రాజేశ్, నాగరాజు, దానియేలు, రాజు, నరసింహులు, విజయ్ పాల్గొన్నారు.

మంత్రాలయంలో అక్టోపస్ మాక్‌డ్రిల్

మంత్రాలయం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం శ్రీరాఘవేంద్రస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు భద్రత చర్యలపై శ్రీమఠం ప్రాంగణంలో ఉగ్రవాదుల ప్రతిస్పందనపై అక్టోపస్ బృందం మాక్‌డ్రిల్ నిర్వహించారు. సోమవారం రాత్రి 10.30 గంటలు దాటిన తర్వాత అర్ధరాత్రి 1గంట వరకు ప్రాంగణంలో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థుల సమక్షంలో సీఐ రామాంజులు, ఎస్ఐ శివాంజల్, విజయవాడ నుంచి అసిస్టెంట్ కమాండర్ మధుసూదనరావు, రిజర్వ్ ఇన్స్పెక్టర్‌లు రామచంద్రనాయక్, వరప్రసాద్, రామ్మోహన్, నరేష్, నాగస్వామి ఆధ్వర్యంలో దాదాపు 40 మంది అక్టోపస్ బృందంతో మాక్‌డ్రిల్ చేశారు. ఉదయం నుంచి గురురాజాంగణ భవనంలో శ్రీమఠం అధికారులతో పాటు ప్రభుత్వ అధికారులకు బోధన పద్దతిలో శిక్షణ ఇచ్చారు. రాత్రి మాక్‌డ్రిల్ నిర్వహించడం వల్ల ఉగ్రవాదుల నుంచి భక్తులను కాపాడడం వంటి అవగాహనకు శ్రీమఠం అధికారులకు మెలకువలు నేర్పారు.

'విద్యను విస్మరించిన ప్రభుత్వాలు'


నూతన కమిటీ సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వాలు విద్యను విస్మరించాయని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప అన్నారు. సోమవారం పట్టణంలోని కేవీపీఎస్ కార్యాలయంలో వారు మాట్లాడుతూ దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం విద్యను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అనంతరం ఎస్ఎఫ్ఐ పట్టణ నూతన కమిటీని ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ అధ్యక్షుడిగా యుగందర్ రెడ్డి, కార్యదర్శులుగా రాము, ఉపాధ్యక్షుడు దేవాన్స్, బాలును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్ , గోవిందు, రాముడు, తిక్కన్న తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు న్యాయం చేసే వరకు పోరాటం ఆగదు


సంకెళ్లతో నిరసన తెలుపుతున్న కార్మికుల కుటుంబ సభ్యులు

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మిగనూరు మున్సిపాలిటీ కార్మికుల కుటుంబాలకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని సీపీఐ పట్టణ కార్యదర్శి రంగన్న, సీపీఐ జిల్లా నాయకులు రాజు అన్నారు. మున్సిపాలిటీలో పనిచేస్తూ అనారోగ్యంతో మృతి చెందిన పారిశుధ్య కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగాలు ఇవ్వాలని చేపట్టిన దీక్ష సోమవారం 8వ రోజుకు చేరింది. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి విజయేంద్ర, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

● సోమవారం ప్రజా ఫిర్యాదుల వేదికలో కలెక్టర్ డాక్టర్ సిరిని ఏఐటియూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మునెప్ప, నగర కార్యదర్శి చంద్రశేఖర్‌లు వినతిపత్రం అందజేశారు. గత 7రోజులుగా ఆందోళన చేస్తున్నప్పటికి మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డికి చలనం లేదని తెలిపారు.

ఆస్తి పన్నును సకాలంలో చెల్లించాలి

ఎమ్మిగనూరు టౌన్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పట్టణ ప్రజలు ఆస్తి పన్నును సకాలంలో చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. సోమవారం ఆయన పట్టణంలోని 2వ వార్డులో విస్తృతంగా పనులను పర్యవేక్షించారు, వార్డు ప్రజలను అడిగి సమస్యలను తెలుసుకున్నారు. పారిశుధ్య పనులు, రోడ్డు, డ్రైనేజీ, నీటి సరఫరా వంటి పెండింగ్ పనులను పరిష్కరించాలని అధికారులను అదేశించారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీమఠానికి రూ.లక్ష విరాళం

మంత్రాలయం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి బెంగుళూరుకు చెందిన ప్రతిమ అనే భక్తురాలు రూ.లక్ష విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏవో మాధవశెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్, శ్రీపతి ఆచార్ లు తెలిపారు. సోమవారం రాత్రి కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని నగదును విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల,పుష్ప, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో శ్రీపాధాచార్, దేశాయ్ నరసింహాచార్, అనంతపురాణిక్, సుజ్ఞానేంద్ర ఆచార్,లక్ష్మీకాంతాచార్ పాల్గొన్నారు.

ముగిసిన తేనెటీగల పెంపక శిక్షణ


శిక్షణ పూర్తిచేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

ఎమ్మిగనూరు రూరల్, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు మండల పరిధిలోని బనవాసి కృషి విజ్ఞాన కేంద్రంలో గత వారం రోజుల క్రితం ప్రారంభమైన తేనెటీగల పెంపక శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసినట్లు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ రాఘవేంద్ర చౌదరి తెలిపారు. శిక్షణ కార్యక్రమం పూర్తి చేసుకున్న విద్యార్థులు, రైతులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

పత్తి లారీ బోల్తా..



కోసిగి, నవంబరు 24 (ఆంధ్రజ్యోతి): కోల్‌మాన్ పేట గ్రామ సమీపంలో సాయిబాబా గుడి వద్ద ప్రధాన రోడ్డుపై సోమవారం రాత్రి కర్ణాటకకు చెందిన పత్తి లారీ బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలు కాగా, లారీలో ఉన్న నలుగురు కూలీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కోల్‌మాన్ పేట గ్రామస్థులు లారీలో ఇరుక్కుపోయిన కూలీలు, డ్రైవర్‌లను బయటకు తీసి ప్రమాదం నుంచి కాపాడారు. మహారాష్ట్రకు చెందిన కొందరు వ్యాపారులు కౌతాళం మండలంలోని పత్తి కొనుగోలు చేశారు.



పత్తి కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు

- రూ. 35వేలు జరిమానా


ఎమ్మిగనూరులో పత్తి వ్యాపార కేంద్రంలో తూకపు యంత్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఎమ్మిగనూరు, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు పట్టణంలో పత్తి వ్యాపారాలు నిర్వహిస్తున్న వ్యాపార కేంద్రాల్లో సోమవారం జిల్లా తూనికల కొలతల అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని షేక్షావలి కాటన్, ఈరన్న ఫుడ్ గ్రైన్స్, గౌస్ కాటన్ ట్రేడర్స్, గిడ్డయ్య కాటన్స్, ఆశాట్రేడర్స్, హెచ్‌కేజీఎస్ కాటన్ మర్చంట్, లక్ష్మి నరసింహ ట్రేడర్స్‌లలో అధికారులు తనిఖీలు చేపట్టారు. లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్ ఎస్ఎండీ గౌస్ మాట్లాడుతూ వ్యాపారుల్లో కొందరు ఉపయోగిస్తున్న తూకపు యంత్రాలు రీస్టాంపింగ్ గడువు, వెరిఫికేషన్ దాటినవిగా గుర్తించడం జరిగిందన్నారు. 10కేజీల తూకం కు 1200 గ్రాముల తక్కువ చూపించిందన్నారు. దీంతో లీగల్ మెట్రాలజీ చట్టం ప్రకారం రెండు కేసులు నమోదు చేసి రూ. 35 వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కాటాల పని తీరుపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు ఖచ్చితంగా వారు వాడే తూకపు యంత్రాలను లీగల్ మెట్రాలజీ శాఖచే సరి చేసుకొని ముద్ర వేయించుకోవాలన్నారు. అలాగే లీగల్ మెట్రాలజీ శాఖ జారీ చేసిన ధృవపత్రాన్ని తమ వ్యాపార సముదాయంలో ఉంచుకోవాలన్నారు. అలా చేయని వ్యాపారస్తులపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి స్థలం కేటాయించండి


తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న మండల టీడీపీ నాయకులు

కౌతాళం, నవంబరు 24(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు గారి విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని మండల టీడీపీ నాయకులు సోమవారం తహసీల్దార్ రజినీకాంత్ రెడ్డిను కోరారు. సోమవారం టీడీపీ సీనియర్ నాయకుడు ఉలిగయ్య, మండల అధ్యక్షుడు సురేష్ నాయుడు, కౌతాళం సింగల్ విండో అధ్యక్షుడు వెంకటపతి రాజు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో అనువైన స్థలం ఉంటే తప్పక కేటాయిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రాజానందు, ఉప్పరహల్ సుభాన్, కురువ వీరేష్, చంద్ర, రామలింగ, గోవిందు, తిప్పలదొడ్డి మల్లయ్య, శ్రీరాములు ఉన్నారు.